# రాగద్వేషాలు

సుజాత ఇట్టే మంచంమీద వత్తిగిల్లిందో లేదో. "తలుపు తలుపు" అంటూ గట్టిగా పిలిచాడు మధుసూదన రావు.

వస్తున్నా అంటూ నిద్రకళతగా వచ్చి సుజాత తలుపుతీసింది. 'ఇందాకటినుంచి మేలుకు నేవున్నా... ఇట్టే కునుకుపట్టింది... టైమెంతయిందేమిటి...' సుజాత కళ్లు నలుపుకుంటూ అడిగింది.

"నీ కెప్పుడూ నిద్రే. నేను వచ్చేదాక నువ్వెప్పుడు మేలుకుని వున్నావనిలే..." మధు ఎగతాళిగా అనేసి ఫైల్సు అందిచ్చాడు.

సుజాత వాటిని తీసుకువెళ్లి డ్రాయరుమీద పెట్టేసింది.

"విన్నావా ఇవ్వాళ ఓ తమాషా అయింది. సూర్యారావును పిలవకుండా, మేనేజరు నన్నే పిలిచి రేపు జరగబోయే ఇన్‌స్పెక్షన్ గురించి చెప్పేశాడు... ఇప్పుడు సూర్యారావుకు నామీద యెంతైనావుంది..."

"రోజురోజుకు మీ ఇద్దరి పగ యెక్కువయిపోతోంది. చివరకు యే విధంగా దారితీస్తుందో అని నాకు భయం...అమ్మాయి మీకోసం కలవరించి కలవరించి నిద్రపోయింది. ఇవ్వాళన్నా తెచ్చారా..."

"ఇవ్వాళా మరిచేపోయాను సుమా. తప్పకుండా రేపన్నా జ్ఞాపకముంచుకోవాలి ... ఈ ఇన్‌స్పెక్షన్ చాలా పెద్దది. దానికి చాలాతతంగం చెయ్యాలి. ఈ దెబ్బతో మన పేరు ప్రతిష్ఠలు పెరిగిపోతాయి. ఏ చిన్న పనికైనాసరే మా మేనేజరు నన్ను పిలవాలిసిందే..." మళ్లీ ఆఫీసు గొడవలు చెప్పటం మొదలుపెట్టాడు మధు.

ఎవరు యేమి మాటాడుతున్నా సరే మధుకు మాత్రం తన ఆఫీసు గొడవలే మెదడులో మెదులుతూ ఉంటాయి. మరీ అంత ఆఫీసు మెంటాలిటీ

ఏమిటి అని చాలామంది యెగతాళి చేస్తూవుంటారు కూడ. అయితే సుజాత మాత్రం మధును పూర్తిగా అర్థం చేసుకుంది. అందుకనే రాత్రిళ్లు ఇంటికి రాగానే ఆఫీసు ఫైళ్లన్నీ అలమారలో పెట్టేసి, తనంతటతానే ఆఫీసు వ్యవహారాల్ని అడుగుతుంది. మధుకు ఎంతో హాయిగా వుంటుంది. రద్దురూ భోజనానికి అన్నాకూడా, మధు ఇప్పుడేగా వచ్చింది లేస్తానులే అంటూ రాత్రి పదకొండు పన్నెండింటిదాకా కూడ ఆ వ్యవహారాలే చెప్పుకొంటు పోతాడు కూడ. అందువల్లనే తానే అడిగితేతప్ప మధును భోజనానికి లెమ్మనదు. రోజూ తండ్రి ఆఫీసుకు వెళ్లేటప్పుడు నేను నిద్రపోయేలోగా నువ్వు రావాలి నాన్నా అంటుంది కాని యింతవరకు పావని నిద్రపోక మునుపు మధు యింటికి రానేరాలేదు పావనికి అమ్మకంటే నాన్న అంటే ఎంతో చనువు. నేను ఇంట్లో వుండనే వుండను. దీనికి యింత చనువు యెట్లా యేర్పడిందో అని అనుకుంటూ వుంటాడు మధు.

భోజనం కాగానే అతని అలవాటు చొప్పున మళ్లీ ఫైళ్లు చూస్తున్నాడు.

"సుజాతా యేంచేస్తున్నావు...ఇంకా భోజనం కాలేదేమిటి......"

"అయిపోయిందిలెండి వస్తున్నా..." అంటూ గబగబ పనులు పూర్తి చేసుకుని సుజాత వచ్చి మధు దగ్గర కూర్చుంది.

"ఊరికే కూర్చోపెట్టి నెలవంగానే జీతం యివ్వాలని వుంటుంది. ప్రతివాడికి మా ఆఫీసులో పనంటే సరే యెక్కడలేని వంకలు వస్తాయి. పని చెయ్యటం యిష్టంలేకపోతే అసలు ఆఫీసుకు రావటం యెందుకో......" మధు కాగితాలు త్రిప్పేస్తున్నాడు.

"అందరూ మీ మాదిరే అంత శ్రద్ధ తీసుకుని పనిచేస్తారేమిటి. చేసినా చెయ్యకపోయినా జీతం వస్తుంటే సరి..."

"ఇకా అదా......మన ఆత్మకు సంతృప్తి వద్దు. మనం తీసుకునే ప్రతి రూపాయికి తగ్గట్టు పనిచేశామా లేదా అని ఆలోచించుకోవద్దు......అన్నా

యంగా సొమ్ము తీసుకుంటుంటే అది మాత్రం యెన్నాళ్లు నిలుస్తుంది. ఇంతకీ యీ తమాషా చూశావా. వాళ్లేవరు పనిచెయ్యరు. పైగా నేను పని చేస్తుంటే వాళ్లకు నా మీద కోపం యెందుకంట. ...ఇవ్వాళ నిద్రవస్తోంది యెందు కనో రేపు చూస్తానులే మిగతావి...” మధు ఫైళ్లనన్నింటిని అలమారలో పెట్టేశాడు.

ప్రక్కలో పావని కదులుతోంది. మంచంమీద మధు మెసులుతున్నాడు. వీధి తలుపు గడియవేసేసి సుజాత లోపలికి వచ్చింది, రెండు వైపులా చూస్తూ.

కోడి కూసింది. పావని లేచింది.

“నాన్నా నాన్నా...పట్టు పరికిణీ తెచ్చావా...” మధును తట్టుతూ లేపుతోంది పావని.

“అమ్మా......నాన్న పట్టుపరికిణీ తెచ్చాడా...” అమ్మవైపుకు కూడా తిరిగింది.

సుజాత వులిక్కిపడి లేచింది.

“పావనీ...యిటు రా...నాన్నగార్ని నిద్రపోనీ... నేను చెపుతా రా...” చెయ్యిపట్టుకుని సావిట్లోకి తీసుకువెళ్లింది సుజాత.

“పరికిణీమాట చెప్పవేనాకు” గట్టిగా పట్టుపట్టింది పావని.

ఇంతలో మధుకుకూడా పూర్తిగా మెలుకువ వచ్చింది.

“పరికిణీ కొన్నానమ్మా. రాత్రి వాన కురిసిందని ఆఫీసులో పెట్టేసి వచ్చేశా. ఇవ్వాళ ఆఫీసుకు వెళ్లంగానే నాగరాజుచేత పంపిస్తా...”

“అన్నీ అబద్ధాలే. నువ్వెప్పుడు యిట్లాగే అంటుంటావు...సినిమాకు తీసుకు వెళ్లమంటే నేమొ ఒక్కనాడు తీసుకువెళ్లవు. పరికిణీ కొనుక్కురమ్మంటే నేమొ ప్రతిరోజూ మరిచేపోతూ వుంటావు. నువ్వు మంచివాడివి కాదు నాన్న...పావని మారాము చెయ్యటం మొదలు పెట్టింది.

"ఇవ్వాళ తప్పకుండా సినిమాకు తీసుకువెళతానే..." అన్న తర్వాత నాలిక కరుచుకున్నాడు మధు.

సుజాత మొహంకూడా విప్పారింది. పావని కొంచెంగా సంతృప్తి పడింది.

"సినిమాకు తీసుకు వెళ్ళినాకూడా పట్టుపరికిణీ కొనాలి నాన్నా..." పావని కళ్లు నలుపుకుంటూ అన్నది.

అమాంతంగా పావనిని యెత్తుకున్నాడు మధు, "నీకు పరికిణీ కొని పెడతా. సినిమాకు తీసుకెళతా సరేనా" అంటూ.

ఇక యింట్లో పనులన్నిటిని చురుకుగా చేసేస్తోంది సుజాత. పావని సంతోషంతో యిల్లంతా తిరిగిపోతూ హడావిడ్ చేస్తోంది. పడక కుర్చీలో …సేపు నడుంవాల్చి గడియారంవైపుకు చూస్తూ ఆలోచిస్తున్నాడు మధు.

గభాలున గడియారం గంటలు కొట్టటం మొదలుపెట్టింది. భోజనానికి రండంటూ సుజాత పిలుపుకూడా వచ్చింది. ఆఫీసుకు వెళ్లేటప్పుడు మళ్లీ పావని సినిమా సంగతి జ్ఞాపకంచేసింది. మధు గట్టిగా అయిదింటికే యింటికి వచ్చేస్తానని చెప్పి వెళ్లిపోయాడు.

"అమ్మా, నిజంగా నాన్న సినిమాకు తీసుకువెళతాడా..." పావని అనుమానిస్తూ అడిగింది.

"ఏం నీకింకా నమ్మకం లేదా..." సుజాత నవ్వుతూ అన్నది. ఆనాడల్లా యేవో పనులుచేసుకుంటూనే వున్నది సుజాత. తెల్లారితే సరి ఒక్క నిమిషం యింట్లో వుండదు పావని. ఆటపాటలంటే మహా సరదా. తల్లి కాసేపన్నా చదువుకోరాదుటే అంటూ ఎప్పుడు పోరుతూవున్నట్లు కనిపిస్తుంది. ఆనాడు యెందుకనో ఇంట్లో ఒంటరిగానే కూర్చుని ఏదో పుస్తకం చదువుతోంది పావని, మాటిమాటికి గడియారంవంక చూస్తూ ఎంతసేపటికి టైము జరుగుతున్నట్లు కనిపించటంలేదు.

"అమ్మా, గడియారం చెడిపోయిందేమిటే సరిగ్గా నడవటంలేదు..." పావని గడియారంవంక చూస్తూ అన్నది.

"ఏమయిందేమిటి?..."

"ఇప్పుడు ఒంటిగంటేనా అయింది" ఆశ్చర్యంగా అన్నది.

గడియారం పన్నెండు గంటలు కొట్టింది. పావనికి అర్థంకాలేదు, ఏ టైము రైటోనని. గబగబ ప్రక్కింటి వాళ్లదగ్గిరికి వెళ్లి టైమడిగి వచ్చింది.

"అమ్మా, మన గడియారం చెడిపోయిందే. టైమేమొ ఒంటిగంటాను. కొట్టటమేమొ పన్నెండూను..."

"నాన్నగారు రాంగానే చెపుదాంలే..."

"ఎప్పుడొస్తారే..."

"మరీ అంత తొందరవుతే యెట్లాగే. అయిదవనీ..." సుజాత మల్లె పూలు కొన్ని చెండు గుచ్చుతోంది.

ప్రక్కనేవచ్చి పావని కూర్చుంది. పావనికి జడవేసి, తాను వేసుకుని, బట్టలు మార్చుకుని గడియారంవంక చూసినాకూడా నాలుగే అయింది. పావనికి చెడ్డ విసుగుపుట్టిపోతోంది. ఇక వాకిటి గుమ్మందగ్గర్నుంచి కదలలేదు. వచ్చే పోయేవాళ్లందర్ని చూస్తూ నిలబడింది. కళ్లు మంటలు పుడుతున్నాయే గాని మధు జాడ కనిపించలేదు.

"అమ్మా, అయిదింటికి వస్తానన్నాడు. ఇంకా యింతవరకు రాలేదేమిటే..." తన కోపాన్నంతా తల్లియెదుట వెళ్లబుచ్చుతోంది పావని.

'సినిమాకు యింకా చాలా టైముందిలే. అప్పటికివస్తే సరిగదా నీకు...' సుజాత సమాధానపరుస్తోంది.

"అమ్మా, నాగరాజు వచ్చాడే...అదుగో పరికిణీ..." ఎంతో సంతోషంతో పరికిణీ అమాంతంగా తీసుకుంది అతని చేతులోంచి.

'అమ్మయ్య నీకోరిక తీరింది గదా. ఇక సినిమామాట యెత్తవుగా...' సుజాత మాటవరసకి అన్నది.

"అమ్మ......పోనిలే నాకు సినిమా అక్కర్లేదులే" పావని ఆ పరికిణీ మురిపంలో పడిపోయింద.

"అయ్యగారు సినిమాహాలుకే సరాసరి వస్తారుట. మిమ్మల్ని సినిమా హాలుకు తీసుకురమ్మన్నారండి" నాగరాజు మెల్లిగా చెప్పాడు.

ఒక్క గంతులో పావని తయారయివచ్చింది. తలుపు తాళం పెట్టేసి సుజాతకూడా వాకిట్లోకి వచ్చేసింది. సరిగ్గా బండీ దిగంగానే మధు తయారుగా వచ్చివున్నాడు. టికెట్లు కొనేసి లోపలికివెళ్లి కూర్చున్నారు. హాలులో కూర్చున్నప్పటినుంచి గాలి, వెలుతురులేని గదిలోపెట్టి తాళం వేసినట్లనిపిస్తోంది మధుకు. ఎంతో వుక్కిరిబిక్కిరిగా వున్నది మధుపని. ఒకటి రెండు సార్లు బైటకు వెళ్ళివచ్చి కూర్చున్నాడు. కళ్ళార్పకుండా అదే ధ్యానంగా పావని సినిమా చూస్తోంది. సుజాతకూడా ఆ ధోరణిలోనే పడిపోయింది.

"ఇన్‌స్పెక్షన్ రిపోర్టు ఫైలు పెట్లో పెట్టావా..." మధు అమాంతం ఓ ప్రశ్న వేశాడు.

ఊఁ అని ముక్తసరిగా సమాధానం యిచ్చింది సుజాత.

"గుమాస్తాల జీవితాలు దుర్భరంగా వున్నాయి. వాళ్ల గోడు వినే నాధుడే కనిపించటం లేదు. వంచిన తల యెత్తకుండా నడుములు విరిగేటట్లు వ్రాస్తారుకాని..."

చప్పున మధుకు సూర్యారావు జ్ఞాపకం వచ్చాడు.

"వింటున్నావా యిదే వరస మా సూర్యారావుకూడా. గుమాస్తాలు అన్న తర్వాత పనిచెయ్యక ఏం చేస్తారు..." తాను సినిమాహాలులో వున్నానన్న సంగతికూడా మరిచేపోయి కొంచెం బిగ్గరగానే వుద్రేకంలో అనేశాడు మధు.

సుజాత చాలా చిన్న పుచ్చుకుంది. సిగ్గుతో బాగా తలవంచేసుకుంది. కొంచెం తలెత్తి అటుయిటు చూసింది ఎవరైనా యెరుగున్న వాళ్లున్నారేమోనని కొంచెందూరంలో మూలగా పై వరసలో వసంత మాత్రం కనిపించింది. సుజాతకు ముచ్చెమట్లు పోసినాయి. గుండె దడదడ కొట్టుకోవటం మొదలు పెట్టింది.

"అమ్మా, వసంత పిన్నిగారే..." పావని అనేసింది.

గట్టిగా నోరు నొక్కేసి ఏమి మాట్లాడవద్దని పావనిని అదుపులో పెట్టిందిసుజాత. మొత్తంమీద మనస్సు చిక్కబట్టుకుని, వసంత తనని చూడలేదనే తృప్తిలోనే వుంది సుజాత.

మధు మళ్ళీ ఏమనుకున్నాడో మాట్లాడకండా వూరుకున్నా[illegible] మా అయిపోయేటంతవరకు సుజాత అదో విధంగా నేవుంది. [illegible] లో ఇంటర్వెల్ అయిన తర్వాత, ఆఫీసు గొడవలేస్తావరం యేవ్వ[illegible] న్నాయి మనస్సంతా కలవరపరచుకుని మధు యింటికి వచ్చేశాడు. మనస్సంతా ఆనందంతో నిండిపోయింది పావనికి. సుజాత హృదయంలో అభిమానం దబ్బుతున్నది. ఆ రాత్రికూడా మాటిమాటికి పావనే సినిమా విషయం మాట్లాడుతోంది కాని, మధు సుజాతలు దానిమాటే యెత్తలేదు. మధు వెంటనే అన్నీ మరిచేపోయి తన ఆఫీసు గొడవల్లో పడిపోయాడు యేవో కాగితాలుచూసుకుంటూ. సుజాతకూడా మౌభావంగా నేవుండి పనులన్నీ చేసుకుపోంతోంది. రాత్రి ఒంటి గంటకూడా దాటిపోయింది మధు నిద్రపోయేటప్పటికి. అయినప్పటికి తెల్లవారంగానేలేచి కాలకృత్యాలు తీర్చుకుని సావిట్లో కుర్చీ వేసుకుని ఏవో వ్రాసుకుంటున్నాడు మధు. పావని అప్పుడప్పుడువచ్చి తండ్రిని యేవేవో అడిగిపోతూనేవుంది. అన్నిటికీకూడా సమాధానాలు చెపుతూనే వున్నాడు మధు, ఎందుకే నాన్నగార్ని విసిగిస్తావు అని సుజాత అంటున్నప్పటికి.

"అవునుగాని నీ చదువు విషయం ఏంచేశావు..." మెల్లిగా కుర్చీలోంచి లేచివస్తూ మధు అడిగాడు.

"ఇప్పుడా విషయం జ్ఞాపకం వచ్చిందే..." సుజాత నవ్వుతూ అన్నది.

"ఏంలేదు. మా మానేజరు కూతురు ప్రయివేటుగా ఇంటర్ మీడియట్ చదువుతోంది. దాని విషయం జ్ఞాపకంవచ్చింది. అడిగాను. అంతే..."

'మీ మేనేజరు కూతురి వయస్సుకు నా వయస్సుకు చాలా తేడాలేదు. ఇద్దరికీ పోలిక లేదు లెండి...'

"పోలికకోసం చెప్పానేమిటి. పట్టుదలపడి తేసరి ఎంతలోకి సాధించటం... 'అశ్రద్ధచెయ్యక మళ్ళీ చెపుతున్నాను' గట్టిగా చెప్పాడు మళ్ళీ మధు.

సుజాత మెట్రిక్యులేషను ప్యాసయినట్లు పక్కింటి వసంతకు తప్ప యింకెవ్వరికీ తెలీదు. ఎన్నోచోట్లను అనేక సంధర్భాలలో వెళ్ళినప్పటికి, [illegible] వరకు తన సంగతి అడిగినా చెప్పలేదు. తాను యెన్నో అను [illegible]క మునుపు. యెంతో వరకు చదువుకుందామనుకుంది. కాని [illegible]ళ్ళ అయిపోయింది. యీలోగా చదువుకు ఆటంకం వచ్చిందనుకుంది అంతే అప్పటినుంచి దానివైపు దృష్టి మరల్చనేలేదు. ఎంత చెప్పినా నాకు యిప్పుడు చదువేమిటి అనే ధోరణిలోనే నిస్పృహగానే మాట్లాడుతుంది. తాను మెట్రిక్యులేషను ప్యాసయినట్లు ఎవరికికూడా తెలియకూడదనే సుజాత అభిమతం. యెంతో సిగ్గుపడుతుంది. ఆమాట ఎవరకన్నా తెలుస్తే మధు ఎప్పటికప్పుడు పోరుతూనే వుంటాడు. చదువుకోమని. మధుకు తన భార్య తెలివితేటలమీద గట్టినమ్మకం ఉంది. తన భార్య పెద్ద పరీక్షలు ప్యాసవాలని అతనికి యేదో మోజు. తనకు ఆ అవకాశం యెట్లాగూ లేదు. తన భార్య అయినా చదువుకుంటే బాగుంటుందని మధుకు గట్టికోరిక. మీకులేని చదువు నాకు మాత్రం యెందుకు లెండి అంటూ ఏదో సాకుచెపుతూ వుంటుంది సుజాత. పక్కింటి వసంత మెట్రిక్యులేషన్ చదువుతున్నప్పుడు సుజాత క్రొత్తగా కాపరానికి వచ్చిన రోజులు. ఇద్దరికి స్నేహం బాగా కలిసి పోయింది. వయస్సులో కూడ అట్టే తేడా లేకపోవటం వలన కూడా యిద్దరూ చాలా అన్యోన్యంగా వుంటున్నారు. వసంతకు లెక్కలు చెపుతూవుండేది సుజాత. వసంత మెట్రి

మ్యులేషన్ పరీక్షలో లెక్కల్లో ప్యాసవటానికి కారణం సుజాతేనని వసంత తండ్రికికూడా సుజాతంటే గౌరవంతోకూడిన ప్రేమవుంది. అతివినయంగా సుజాత వాళ్ల అభిమానాన్ని చూరగొన్నది. వసంత కాలేజీకి వెళ్లుతున్న క్రొత్త రోజుల్లో, గుమ్మం దగ్గర నిలబడి పూర్తిగా వసంత కనిపించనంత వరకు చూస్తూవుండేది సుజాత. తర్వాత యింట్లోకి వెళ్లి గంటల తరబడి ఆలోచించుకుంటూ చాల బాధ పడేదికూడ. క్రమక్రమంగా వసంత బి.ఎ. కూడా ప్యాసయింది. సుజాత, పిల్ల తల్లయింది. ఇళ్ళల్లోకి రాకపోకలు చాల బాహాటంగానే సాగిపోతూ వున్నాయి. గంటల తరబడి వసంతవచ్చి యిక్కడ కూర్చోవటంగాని, సుజాత వెళ్ళి వాళ్ళింట్లో కూర్చోవటంగాని పరిపాటయిపోయింది. ఎవరికీ ఎబ్బెట్టుగా అనిపించ లేదు.

ఆనాడు మధు సాయంత్రం ఆరు గంటలకు వచ్చి వాకిట్లో అరుగుమీద కుర్చీ వేసుకుని కూర్చున్నాడు. వసంత వాళ్ల వాకిట గుమ్మం దగ్గర లోపలి వైపుగా నుంచొని యిటువైపుకే అదే ధ్యాసగా చూస్తువుంది. మధు యేమి గమనించటంలేదు. తీరా సుజాత వాకిట్లోకి వెళ్ళేటప్పటికి చప్పున వసంత లోపలికి వెళ్ళిపోయింది. ఆ విషయం సుజాత గ్రహించనేలేదు. మామూలుగానే మధుకూడా లోపలికి వచ్చేశాడు సుజాతతోకూడ. వసంత మళ్ళీ దొడ్లో కనిపించింది. సుజాత యీసారి వసంతను చూసింది. ఆ అవకాశాన్ని తీసుకుని గబగబ వసంత, సుజాత యింటికి వచ్చేసింది. మధు వుండగా అవుతే సుజాతతో, వసంత యెన్నో విషయాలు అతి చొరవగా చెప్పుకుపోతూ వుంటుంది. ఒక్కొక్కప్పుడు యీ చెప్పేవి సుజాతకా మధుకా అనికూడా అనిపిస్తుంది. ఈ ధోరణి యెంతమాత్రం గిట్టదు సుజాతకు. మొహాన కాదనలేక బాధ భరిస్తూ వుంటుంది సహజంగా. అప్పుడప్పుడు మాటలధోరణి తప్పించటానికి ప్రయత్నం చేస్తుందికూడా సుజాత. ఈసారి యింకొంచెం చిరాకే పుట్టింది సుజాతకు.

"కొంచెం పనుందండి... రేపు మాట్లాడుకుందాం..." సుజాతకు అనాల సొచ్చింది.

వసంత, మధువంకే అట్టే చూస్తూ లోపలికి వెళ్ళిపోయింది.

"ఏమిటి అసహ్యంగా అట్లాచూస్తుందేమిటి నావంక" అన్నాడు మధు.

"అదే నేను అనోస్తున్నాను. ఏమిటా వెర్రిచూపులు...మహా వెకిలితనం. ఏదో సోది మొదలుపెడితే తరగదు. చెప్పుకుపోతూనే వుంటుంది. ఒకే తమాషా మనిషి..." అంటూ సుజాతకూడా సమర్థించింది.

ఆ నాటి రాత్రల్లా సుజాత మనస్సులో తన చదువు విషయమే మెదులుతోంది. వసంత చదువు తలుచుకున్నప్పుడల్లా, తన మనస్సుల్లోకి తనకు తెలియకండానే అసూయలాంటి భావం ప్రవేశించిందా అని అనిపిస్తూ వుంటుంది సుజాతకు. తన భర్తనుకూడా ఇంటర్ చదవమని ప్రోత్సహించాలనుకుంది. మధు పప్పుకోడని తనకు గట్టిగా తెలుసు, మధు ఇంటర్ చదవకపోతే తాను చదవటం అంటే యేమిటోగా అనిపిస్తోంది సుజాతకు. ఎట్లాగైనా కొద్ది రోజులనుంచి సుజాతకవు తేమాత్రం చదువుమీద ధ్యాసమళ్లింది ఎప్పుడు వంటరిగా కూర్చున్నా తన చదువు విషయమే జ్ఞాపకం వస్తూవుంది. ఏవేవో ఆలోచనలు తనకు తట్టుతున్నాయి. వాటంతటికి తాను చదువుకోవటం ముఖ్యమనిపిస్తోంది. ఆ రాత్రల్లా యీ ఆలోచనలతోనే మథనపడుతూ సరిగ్గా నిద్ర కూడా పోలేదు.

మర్నాడు సావకాశంగా కూర్చున్నప్పుడు మధుతో యీ ప్రస్తావన తెచ్చింది. మధు మొదటినుంచీ కూడా సుజాత చదువుకోవాలనే పట్టుదలతోనే వున్నాడు. వెంటనే ప్రోత్సహం యిచ్చాడు. ఆ మాటల్లోనే "వసంత దగ్గర చెప్పించుకో పాఠాలు నీకు బాగా వీలుగాకూడా వుంటుంది" అన్నాడు మధు.

సుజాతకు మొదట యేదో సిగ్గనిపించింది. తాను మెట్రిక్యులేషన్‌లో లెక్కలు చెప్పిన అమ్మాయిచేత ఇంటర్ పాఠాలు చెప్పించుకోవటం అంటె నిజంగా నామోషి అనిపించింది. కాస్త ఆలోచించి చూస్తే, ఈ సలహా

చాలా ఉపయోగకరంగా వుంటుందని సుజాత కనిపెట్టలేకపోలేదు. ఎన్నాళ్ళుపట్టో, మధు పోరగా పోరగా యీ నాటికి సుజాతకు చదువుకోవాలనే ఒక కుతూహలం కలిగింది. ఆ మధ్యాహ్నమే వసంతతో మాటల ప్రస్తావనలో యీ విషయంకూడా చెప్పేసింది.

"మీరు నాకు మెట్రిక్యులేషన్‌కు చెప్పారు. నేను మీకు ఇంటర్‌కు చెపుతాను" అంది వసంత.

సుజాత మనస్సు చివుక్కుమన్నది. అయినా కూడా వసంతతో కూడా హాయిగా నవ్వేసింది. ఈ చదువురీత్యా వసంత, సుజాతలు, ఒకరింటికి ఒకళ్లు యింకా ధారాళంగా వచ్చేస్తున్నారు, చదువుకూడా చురుకుగానే సాగిపోతోంది.

మధు, ఆనాడు ఫైల్సు అన్నీ దగ్గర పెట్టుకుని దీర్ఘంగా ఆలోచి[illegible] యేవో రాసుకుంటున్నాడు. ఎదురుగుండా వసంత వచ్చి నుంచున్నది. మధు గమనించనేలేదు. తన పనిలో తాను వుండిపోయాడు.

"సుజాత వున్న[illegible]డీ..." సుజాత యింట్లో లేదని తెలుసుకుని అడిగినట్లే అడిగింది వసంత.

"లేదండి..." ముక్తసరిగానే సమాధానం యిచ్చాడు మధు. "ఎక్కడికి వెళ్ళిందండి..." రెండో ప్రశ్న.

"పోనీ యెప్పుడు వస్తుందండి..." మూడో ప్రశ్నతో, మధుకు వసంతకువున్న దూరంకూడా తగ్గింది.

"రాంగానే మీరు వచ్చారని చెపుతాలెండి..." ఫైల్సు పట్టుకుని నుంచున్నాడు.

వసంత నవ్వు ఆపుకోలేకపోయింది.

మధుకు మహా చిరాకు పుట్టుకొచ్చింది. వసంత యెదట యేమీ అనలేక, "రాంగానే చెపుతాను లెండి" అంటూ కూర్చున్నాడు.

అప్పటికీ వసంతకు తృప్తిని యివ్వలేదు. ఇంకా యేవేవో ప్రశ్నలు వేస్తూనేవుంది. టూకీగా సమాధానాలు చెప్పేసి తన పని తాను చూసుకుంటున్నాడు మధు. మధుకు స్వతహాగా ఆడవాళ్ళతో మాట్లాడటం అంటే చెడ్డసిగ్గు. అందులో ప్రక్కింటి అమ్మాయితో మాట్లాడటం, అంటే మహా అభిమానం. ఎంతో తొందర్లోనే పంపించేద్దామని మధు చాలా ప్రయత్నం చేశాడు. కాని సుజాత వచ్చేదాక మాత్రం వసంత అట్లాగే మధుయెదుట దగ్గరగానే నిలబడివుంది. సుజాత రాంగానే, వసంత యేదో భయాన్ని నటిస్తూ, ఎక్కడికి వెళ్లారు, ఇప్పుడే మీ మాట అడుగుతున్నాను" అన్నది వసంత ప్రయత్నంగా.

"శారదమ్మ యింటికి వెళ్ళి యిప్పుడే వస్తున్నా..." సమాధానంగా అనేసింది సుజాత.

మధు మొహం చిట్లించుకున్నాడు.

"ఇంట్లో కొంచెం పనుంది. ఓ గంటాగివస్తాను లెండి..." అన్నది సుజాత ఓ క్షణం ఆగి.

వసంత మెదలకండా వెళ్లిపోయింది.

"ఏదో పరీక్షలవుతే ప్యాసయింది కాని, వట్టి అమాయకురాలు. ఎవరితో ఎక్కడ ఏమి మాట్లాడాలో కూడా తెలీదు..." సుజాత జాలిగా అన్నది.

అవునన్నట్లు తల వూపాడు మధుకూడా.

మళ్ళీ తన ఫైల్సు గొడవల్లోకి పోయాడు మధు. సుజాతను కూర్చోపెట్టి, ఆ వ్యవహారాల పుట్టుపూర్వోత్తరాలన్నింటిని చెప్పుకుంటూ పోతున్నాడు. మధు ఆ మాటల వుత్సాహంలో ఆకలి మరిచేపోయినా, సుజాతకు మాత్రం, చిరాకు, ఆకలిని బాగా జ్ఞాపకం చేస్తూనే వుంది.

మధు యేమనుకునిపోతాడో అని సహనం ప్రదర్శించినా, యింక ఆగలేక పోయింది సుజాత.

"భోజనాలు చేసి మళ్లీ కూర్చుందాంలెండి..." జంకుతూనే అంది సుజాత.

"టైమెంతయిందేమిటి...ఆ..." గడియారంవంక ఆశ్చర్యంగా చూసి చివాలున లేచాడు మధుకూడ.

వసంతమీద యిద్దరికీ యే అభిప్రాయాలున్నా కూడా, చదువు విషయంలో శ్రద్ధ తీసుకొంటోందనే గురి మాత్రం, సుజాతకు వున్నది వసంతమీద. తాను యింకా చదవగలను అనే ధైర్యం తెచ్చిపెట్టింది వసంతే. ఆ దృష్టిలో మధుకు గౌరవమే వసంత అంటే. అందువలన మధుతో యెప్పుడైనా వసంత మాట్లాడటం మొదలుపెట్టితే, సుజాత వినీవినకండా వున్నట్లు ప్రవర్తిస్తూ వుంటుంది. మధు కూడా అట్టే బాధపడకండా యేవో సమాధానాలు అతి చనువుగానే చెప్పేస్తూ పంపేస్తూ వుంటాడు. అయితే యీ అవకాశాన్ని మాత్రం వసంత పూర్తిగా వినియోగించుకుంటూనే వుంది. ఇప్పుడిప్పుడే మధుకుకూడా సంకటపరిస్థితి యేర్పడింది. తానిచ్చిన చొరవవల్లనే యీ క్లిష్టపరిస్థితి యేర్పడిందని తెలిసికూడా, యిప్పుడు యేమంత కటువుగా చెప్పే పరిస్థిలో లేడు. సుజాతకు కూడా యిదొక సమస్యగానే తయారయింది. చూస్తూ చూస్తూ "నా భర్తతో మీరు యేమీ మాటాడకండి" అంటే బాగుండదని సుజాతకు తెలుసు. మధు ప్రవర్తనలోనే క్రమేణా మార్పు కనకవస్తే, కొంచెం సమసిపోతుందని, భార్యాభర్తలు ఏకాభిప్రాయానికి వచ్చారు. వసంత గమనించినట్లు ప్రవర్తించటంలేదు. రోజులు జరిగిపోతున్నకొద్దీ, చదువు అవుతే చాలా చురుకుగానే సాగిపోతోంది.

అ నాడు సాయంత్రం చల్లగాలికి వాకిట గుమ్మంలో, సుజాత, వసంతలు కూర్చుని యేవో మాట్లాడుకుంటున్నారు. ఆ నాటినుంచి పాఠంకూడా సాయంత్రమే చెప్పుకుందామని అనుకున్నారు కూడా. ఇంతలోనే యెవరో

అపరిచితమైన వ్యక్తి అక్కడికివచ్చి "ఇక్కడ వెంకటేశ్వరరావుగారి యిల్లెక్కడండి" అన్నాడు అతి వినయంగా.

"వెంకటేశ్వర రావుగారా...యిక్కడ యెవరూ లేరండి. మీకు యెక్కడని చెప్పారు..." సుజాత ఆలోచిస్తు అడిగింది.

"ఈ సందులోనే అని చెప్పారండి..." అతను అన్నాడు.

"ఎవరూ ఇక్కడ ఆ పేరు కలవారు లేరే..." సుజాత, వసంతవంక చూసింది.

వసంతకూడా తనకు తెలీదని తలవూపింది.

అతను సందుచివరిదాకావెళ్లి, మళ్లీ యిటొచ్చేసి, 'ఆ చివర వున్నారటండి. ఇవ్వాళ వూళ్లో లేరట. రేపు వస్తారట' అని, మెల్లిగా వెళ్లిపోయాడు.

"చాదస్తుడు, ఆయన సంగతి మనకెందుకో..." సుజాత నవ్వింది వసంతవంక చూస్తూ.

ఆ నాడు పాఠాలు అంతటితో సమాప్తి.

పావని యేదో మారాం చేస్తుంటే, సముదాయించి అన్నంపెట్టి నిద్రపోపింది ఆ రాత్రి.

రాత్రి, పది, పదకొండు, పన్నెండు, మనుజాడ యే మాత్రంలేదు. సుజాతకు కంటిమీద కునుకు పట్టలేదు, ఎటూ తోచడంలేదు.

ఈ అర్థరాత్రి యెటని వెళుతుంది. అయితే సుజాతకుమాత్రం ఓనమ్మకం వుంది, తన భర్త ఆఫీసులోనే తప్పకుండా యేవోపనులు చేసుకుంటూ వుంటాడని. అయినా నిద్రాహారాలులేకుండా యేమిటీపని. తనకు యెంతో ఉక్రోషం వచ్చేసింది. గోడగడియారం ఓగంట కొట్టేటప్పటికి వులిక్కిపడింది. ఆ యింట్లో తాను, పావనెఅని అప్పటికి స్ఫురణవచ్చింది. సుజాతకు మహా

భయంవేస్తోంది. మెల్లిగావెళ్ళి, పావనిదగ్గర పడుకుని, ముసుగుపెట్టుకుని కళ్లు మూసుకుంది. అప్పటికీ సుజాతకు యెందుకో భయంవేస్తోంది. ఒకటి రెండు సార్లు తలుపు చప్పుడయినట్లనిపించింది. లేవటమా లేవకపోవటమా అనేమథనతో తన్నుకుపోయింది. ప్రాణాలు బిగపెట్టుకుని, మెల్లిగాలేచి తలుపుదగ్గరకు వెళ్లి గడియతీసింది. యెదురుగుండా నల్లగా కనిపించిది. సుజాతకు పై ప్రాణాలు పైనే యెగిరిపోయినాయి. తలుపు గబాలునవేసేసి దీపంతీసుకుని లోపలికివెళ్లిపోయింది. మళ్ళీ తలుపు చప్పుడవటం మొదలుపెట్టింది. ఈసారి పావనినికూడా లేపింది తనకు తోడుగా. అడుగుల్లో అడుగులు వేసుకుంటూ, దీపం బాగా పెద్దదిచేసి తలుపు వోరవాకిలిగాతీసి, ఆ సందుల్లోంచి మెల్లిగా బైటకు చూసింది. ఈతాకులచాప సగం ముడిచి వాకిట్లో నిలబెట్టివుంది. ధైర్యం తెచ్చుకుని ఆ చాపను కాస్త ఇంట్లోకి గిరాటు పెట్టింది. అప్పటికీ వీధితలుపు చప్పుడవుతూనే ఉంది. లాంతరు తీసుకువెళ్లి తీరా చూసేటప్పటికి, తలుపుకు పైగా ఉన్న బాదంకొమ్మ, గాలికి ఊగుతూ తలుపుమీద పడుతోంది. విపరీతమైన కోపంతో సగం విరిగిన ఆ కొమ్మను కాస్త క్రిందకు లాగేసింది. మళ్ళీ వెళ్ళి ముసుగు పెట్టుకుని పడుకోంగానే కొక్కొరకో అంటూ చెవిక్రింద మోగినట్లు మోగింది. కంటిమీద కునుకు లేకుండానే ఖళ్లున తెల్లారింది. ఏడు దాటుతూ వుండగా, మధు అదుర్దాగా యింటికి వచ్చేశాడు.

"నీకు కబురు పంపుదామన్నా, సమయానికి మనిషి దొరకలేదు, అసలు నేను రాత్రంతా అక్కడ వుందామని అనుకోలేదు. పనిచేస్తూ కూర్చునేటప్పటికి టైము తెలియనే తెలియలేదు. తీరా పన్నెండు దాటిన తర్వాత కాని మేము గడియాతం చూడలేదు. నీ కేమన్నా భయంసేశిందా"...మధు, పావనిని దగ్గరకు తీసుకున్నాడు.

"రాత్రి భోజనంచేశారా..." సుజాత, మధు మొహంలోకి చూస్తూ అడిగింది.

"ఆ అర్ధరాత్రివేళ అన్నం యేమి తింటాం, ఏదో టిఫిన్ తిని కాఫీ తాగాం పాపం ఆ మేనేజరుకూడా అంతే..."

"బలే పనిచేశారు...ముందర యీ కాఫీ త్రాగండి... పెందరాళే వంటకూడా చేస్తాను..." సుజాత హడావిడిగా పనులు చేసుకుపోతోంది.

"నాకేం తొందర్లేదులే. మామూలు వేళకే కానీలే..." మధు అనేసి, పావనితో కబుర్లు చెపుతూ కూర్చున్నాడు.

తొమ్మిది దాటుతూ వుండగానే స్నానానికిలేచి, మళ్లా సరిగ్గా పదింటికే ఆఫీసుకు వెళ్ళిపోయాడు మధు.

మళ్ళీ మధు యింటికి వచ్చేలోగా, యింట్లో పనులు చూసుకోవటం పాఠాలు చదువుకోవటం సుజాత కార్యక్రమం.

మళ్ళీ సాయంత్రం యధాప్రకారంగానే సుజాత, వసంతలు, వాకిట గుమ్మందగ్గరే కూర్చుని పుస్తకాలు తిరగేస్తున్నారు. వసంత చెపుతున్న పాఠం బహుశ్రద్ధగా వింటోంది సుజాత. మళ్లీ క్రిందటిరోజు వచ్చినతనే వచ్చి, సందు చివరిదాకా వెళ్లి తిరిగివచ్చి వీళ్లకు సూటిగావున్న గోడదగ్గర నిలబడిపోయాడు. వీళ్లు మొట్టమొదట గమనించనేలేదు. తర్వాతచూసి "మళ్ళీ అక్కడ విషయాలు చెపుతాడోయేమో తొందరగా యింట్లోకి పోదాం" అంటూ సుజాత, వసంతలు లోపలికి వచ్చేశారు. మూడురోజులదాక, అతని రాకను గురించిన విషయాన్ని గురించి ఆలోచించే అవసరం యిద్దరికీ కనిపించలేదు. వరసగా అతను ఆ సమయానికే రావటం చూసేటప్పటికి యిద్దరికీకూడా యేదో తెలియనిభయం ఆవరించేసింది. ఆనాడు మరీ చాటుచాటుగా నక్కి మరీమరీ చూస్తున్నాడు. సుజాత, వసంత లిద్దరూ తర్కించుకుంటున్నారు అతన్ని గురించి. ఎందుకొస్తున్నట్లు అనే ప్రశ్నకు యిద్దరికీ సమాధానం దొరకలేదు. వసంత, తన తండ్రితో చెప్పేటట్లు, సుజాత తన భర్తతో చెప్పేటట్లు అనుకుని ఆనాటికి పాఠం సమాప్తం చేసుకున్నారు.

మర్నాడే వసంత, తండ్రితో చెప్పేసింది. సుజాత చెపుదామనుకుంటూనే మరిచేపోతోంది. ఎప్పటికప్పుడు సాయంత్రం అయ్యేటప్పటికిగాని సుజాతకు యీ విషయం జ్ఞాపకం రావటంలేదు. ఇప్పుడవుతే మొదట వస్తున్న

వాడు కనిపించటంలేదు. ఇంకొకతను వరసగా వస్తూనే వున్నాడు. ఇతని ధోరణి యింకోరకంగా వుంది. తలవంచుకుని సందు చివరిదాకా వెళ్ళి అక్కడ యెవరితోనో మాట్లాడి, మళ్ళీ తలవంచుకునే వెళ్ళిపోతూ వుంటాడు. అయినప్పటికి సుజాతకు భయంగానే వుంది.

"ఈ సందుచివర, వెంకటేశ్వరరావుగారు అంటూ యెవరూ లేరట. మా నాన్న కనుక్కొని వచ్చాడు..." అన్నది వసంత.

"అవుతే, అట్లా యెందుకు చెప్పినట్లు మనకు..." సుజాత ఆశ్చర్యంగా చూస్తోంది వసంత కళ్ళల్లోకి.

వసంతకు సమాధానం యేమీ తట్టలేదు. ఇద్దరూ తర్కించుకుంటున్నారు. ఆలోచించుకుంటూనే ఆ సాయంత్రం కాలక్షేపం చేశారు. సుజాత వెళ్ళిపోతూ రేపటినుంచి నేను మీ యింటికే వస్తాను పాఠానికి అన్నది. వసంత ఒక్క క్షణంఆగి, "రేపటినుంచి కాదులెండి. రేపు మా మేనత్తకొడుకు పట్నంనుంచి వస్తున్నాడు. రెండు రోజులు ఆగండి" అన్నది.

"మీ మేనత్త కొడుకే..." సుజాత కొంచెం అదుర్దాగా అన్నది. వసంతకు గుండెల్లో రైళ్లు పరుగెత్తినట్లయింది. సుజాత అన్న మాటల్లో ధ్వని బాగా కటువుగా అనిపించింది వసంతకు. వసంత మొహం చిట్లించుకుంటూ వెళ్లిపోయింది. సుజాతకు యేమీ అర్థంకాలేదు. మళ్ళీ రెండుమూడు రోజులదాక సుజాత, వసంతలు కలుసుకోనేలేదు. పాత పాఠాలు నెమరేస్తోంది సుజాత. క్రొత్త విషయాన్ని ఆకళింపు చేసుకుంటోంది వసంత. ఇంట్లో రెండు మూడు సార్లు మాత్రం యీ మధ్య వసంత మనింటికి వస్తున్నట్లు లేదె అన్నాడు మధు. వాళ్లింటికి యెవరో చుట్టాలు వచ్చారట అందువలన రావటం లేదేమొ అన్నది సుజాత ముక్తసరిగా. సుజాతకు వెంటనే రోజూ సాయంత్రంపూట వస్తున్న వ్యక్తిని గురించి జ్ఞాపకం వచ్చింది.

"ఏమండీ మన సందులోకి రోజూ సాయంత్రంపూట ఓ మనిషి వస్తూ వుంటాడు. మేము పాఠం చెప్పించుకునే కాసేపు యెక్కడో నక్కినక్కి చూస్తూనే వుంటాడు..." అన్నది సుజాత.

"పోనీ ఇంట్లోకిపోయి పాఠాలు చెప్పుకోకూడదు..." మధు అతి తేలిగ్గా అనేశాడు.

"అయినా అతను అట్లా యెందుకు వస్తూవుంటాడో అని మాకు ఆశ్చ ర్యముగా వున్నది..." సుజాత మళ్ళీ ఆదుర్దాను వెళ్ళబుచ్చింది.

"అతను ఏ పనిమీద వస్తున్నాడో, ఆ గొడవలన్నీ మనకెందుకుగాని నేను వెళ్లాలి. అయిందా..." అని లేచాడు కుర్చీలోంచి మధు. సుజాతకు ఆ విషయాన్ని గురించి ఇంకా చెప్పే అవకాశమే లేకపోయింది. గబగబ పనులు పూర్తి చేసుకుని, మధును పంపించేసింది. వసంత దగ్గర చదువు మొదలు పెట్టినప్పటినుంచీ, సుజాతకు చదువుమీద శ్రద్ధ ఎక్కువయిపోయింది. ఏ ఒక్క రోజు పాఠం చెప్పించుకోక పోయినా సుజాతకు యేదో ఇదిగానే వుంటుంది. అందులో మూడు రోజుల్నుంచి పాఠానికి వెళ్ళటంలేదు. సుజాతకు ఏమీ తోచలేదు. మొట్టమొదటవుతే వసంతవచ్చి పిలిచినప్పుడే వెళదామనుకుంది గాని, తర్వాత ఉండపట్టలేక పోయింది. తనంతటతానే వెళ్లి వసంతను అడుగు దామనుకుంది. ఆనాడు సాయంత్రం మెల్లిగా వెళ్లి, వసంతా వసంతా అంటూ తలుపు తట్టింది. రెండుసార్లు తలుపు తట్టగానే లోపలనుంచి వచ్చి తలుపు తెరిచేటప్పటికి సుజాత యెదురుగా ముప్పయియేళ్ళలోపు యువకుడు నిలబడి వున్నాడు. మంచి శరీరం. చేతివ్రేళ్లకు రెండు ఉంగరాలు సిల్కు సూటు, మాంచి బూటు, ఎదురు క్రాఫు, కళ్ళల్లో యెంతో ఆశ, ప్రేమ కొట్టొస్తు న్నట్లు కనిపిస్తున్నాయి. ఒక్క క్షణం సుజాత మొహంలోకి చూసి లోపల వున్నది వెళ్లండి అన్నాడు. సుజాత తన అందాన్ని దాచుకోవటానికి ప్రయ త్నం చేసుకుంటూ బెరుకుబెరుకుగా లోపలికి వెళ్లిపోయింది. లోపలికి వెళు తున్న సుజాతవైపే కన్నార్పకుండా చూస్తూ ఒక్కక్షణం అట్లాగే నిలబడి పోయాడు రవి. సుజాత సాంతం లోపలికి వెళ్లిపోగానే, వాకిట తలుపు వేసేసి, రవి తన గదిలోకి వచ్చేశాడు. లోపలే మొ సుజాత, వసంతలు యేవో మాట్లాడుకుంటున్నారు. వసంత తన తండ్రిని గురించి యేవో చెపుతోంది.

సుజాత వింటూ కూర్చుందే కాని ఒక్కమాటైనా అనలేదు. వసంతకూడా చెప్పటం మానేసింది. చాలా టైమయిందంటూ సుజాత వెళ్లిపోయింది తన యింటికి.

మర్నాడు వుదయం భోజనాలయిన తర్వాత అమ్మాయి వసంతా అంటూ ఆప్యాయంగా పిలిచాడు గోపాలం. వసంత వచ్చి కూర్చుంది.

నేను యెందుకు చెపుతున్నానో కాస్త ఆలోచించు. నేను తండ్రిని, నా జీవితం నీ సుఖంమీద ఆధారపడివుంది. నేనా బ్రతికినన్నాళ్లు బ్రతకపోను. నేను మొదటినుంచి యేంకష్టాలు పడ్డానో అయిపోయింది. ఈ చివర దశలో నన్నా నా మనస్సుకు హాయిగా వుండేటట్లు చెయ్యి అంతే నేను కోరేది.

వసంత వింటూ కూర్చుంది.

"మీ అమ్మ వుద్దేశం వాళ్ల అమ్మ వుద్దేశం కూడా అంతే. నీకు మూడేళ్లనాడు చేసినబట్టు నేను చెపుతున్నాను.

వసంత కళ్లలో నీళ్లు తిరిగాయి.

"గట్టిగా చెపుతే నేమొ యిదీ వరస. ఎట్లాగే నీతో?" వసంత అక్కడి నుంచి వెళ్లిపోయింది.

ఎప్పటికప్పుడు నీ పెళ్లిచూసి కళ్లు మూస్తానంటూ వుంటాడు గోపాలం. ఆ మాట అన్నప్పుడల్లా వసంతకు యెక్కడలేని కోపం, కసి. కోపం అంతా దిగమింగుకుని తండ్రిని యేమీ అనలేక వూరుకుంటోంది. రవి యిక్కడకు వచ్చినప్పటినుంచి వసంతతో తీరిగ్గా మాట్లాడుదామని విశ్వప్రయత్నం చేస్తున్నాడు కాని వసంత యేమాత్రంకూడా అవకాశం యివ్వటంలేదు. రవి తన నైపే వస్తున్నాడని తెలుసుకుంటే చాలు, తాను అక్కడినుంచి వెళ్ళిపోతుంది. ఒకటి రెండు సార్లు తన తండ్రి వున్నప్పుడు కూడా అట్లాగే చేసింది. గోపాలానికి కూడా చెడ్డ చిరాకువేసింది. మొదటినుంచి కూడా ఎందువల్లనో కాని రవి అంటే వసంతకు అర్థం చేసుకునే యీడువచ్చినప్పటినుంచి రవే నీ భర్త

అంటూ మొదలు పెట్టటంతో అదొక యెగతాళి క్రింద తీసుకుంది. క్రమ క్రమంగా పెరిగి పెద్దవాళ్లు అయిన తర్వాత, ఆ భావం, యింకో రకంగా మారి రవిమీద, తనకు అదివరకు వున్న గౌరవంకూడా పోయింది. దానికి తగ్గట్లుగా రవి కూడా, చిన్నప్పటి పోకిరీతనము పెంచుకుంటూనే వున్నాడు. అతని ప్రవర్తన, చేష్టలు, వసంతకు చెడ్డమంట. వసంతకు అతనిలోవున్న కొన్ని లోపాలే ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. అతని చదువు, ఆస్తి, తెలివితేటలు రూపం, యేవీకూడా వసంతను ఆకర్షించలేకపోతున్నాయి. గోపాలం యీ విషయాన్ని గురించి వసంతకు యెన్నోసార్లు చెప్పి చూచాడు. వసంత తనకున్న అభిప్రాయాలు చెప్పటం మొదలు పెడుతుంది.

రవి యిక్కడకు వచ్చినప్పటినుంచి తన ప్రవర్తన మార్చుకుంటున్నట్లు యితరులకు కనిపించాలని యెంతో ప్రయత్నం చేస్తూనే వున్నాడు. కాని పూర్తిగా సఫలీకృతుడు కాలేకపోతున్నాడు. సుజాత యెందుకనో యీ మధ్యలో వసంత ఇంటికి రావటం మానేసింది. వసంతే వెళ్లి, పాఠం చెప్పివస్తూ వుంటుంది. రవికి, సుజాత కనిపించినప్పుడల్లా ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ తాడు. ఈ విషయం సుజాత అట్టే గమనించటంలేదు. కాని వసంత పూర్తిగా గ్రహిస్తూనే వున్నది. సాహసించి రవితో తానేమి చెపుతుంది కనక! మెద లకుండా వూరుకుంది. ఒకటి రెండుసార్లు తన తండ్రితో చెపుదామనుకుంది కూడా.

ఆనాడు పాఠాలు పూర్తి అయిన తర్వాత వసంత లేవబోతోంది వెళ్ల టానికి. సుజాత ఆపి కూర్చో పెట్టింది.

"మిమ్మల్ని ఓ విషయం అడుగుదామని యెప్పటికప్పుడు అడుగుదా మనుకుంటాను అట్లాగే పోతోంది. అడగమంటారా. మీకు..."సందేహిస్తూ అన్నది సుజాత.

"అడగండి తప్పేముంది..." రాని నవ్వును తెచ్చుకుని అన్నది వసంత.

"మీ యింటికి వచ్చిన చుట్టం సంగతి ...మీకు..." మళ్ళీ అనుమానించింది సుజాత.

"అట్లా అవుతే మీకు పూర్తిగా తెలిసిందన్నమాట. ఇంకా దాపరం యెందుకులెండి..." అంటూ వసంత మొదలు పెట్టింది.

"ఎప్పుడో చిన్నప్పుడు యెవరో అనుకున్నారని, దానికోసం మన మనస్సులకు యిష్టంవున్నా, యిష్టంలేక పోయినా ఆపని చేసితీరాల్సిందేనా..." ఓ ప్రశ్న వేసింది వసంత.

"ఎప్పటికప్పుడు మగవాళ్లే వప్పుకుంటూ ఉండటం అన్నమాట. ఆడదానిమాటే లేదన్నమాట..."

సుజాత దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు కూర్చుంది.

"మేనత్త కొడుకు అవంగానే పెళ్లిచేసుకు తీరాలని యేమన్నా వ్రాసివుందా...నా విషయంలో నాకు స్వేచ్ఛ లేకపోయిన తర్వాత యింకేమిటండీ వాళ్ళను వీళ్ళను సంతృప్తి పరచటానికి నా మనస్సుకి యిష్టంలేని పనిచెయ్యను అంతే. ఇదే మా నాన్నకు చెప్పాను. అందుకే నేనంటే ఆయనకు యెంతో కోపం..." చాలా ఉద్రేకంగా మాట్లాడేశేస్తోంది వసంత.

సుజాత యింతవరకు యెన్నడూకూడ వసంతకు యెదురు చెప్పటంగాని వాదానికి ప్రతివాదం వెయ్యడంగాని చెయ్యలేదు. తనకు యిష్టంలేని విషయాలు స్త్రీలను గురించి చెప్పటం యెన్నోసార్లు వసంత నోటివెంబడి విన్నది. వసంత అభిప్రాయాన్ని ఖండించటం తనపని కాదనుకుని, తాను పాఠాలు చెప్పుకోంగానే వెళ్లిపోతూవుండేది సుజాత. కాని వసంతకు మాత్రం, సుజాతకు కొత్త విషయాలు చెప్పాననే తృప్తిమాత్రం మిగిలిపోతూ ఉండేది.

"నేను ఒక్కమాట అంటాను మీకు కోపం రాదుగదా..." అన్నది ఆత్మ విశ్వాసంతోనే సుజాత,

"ఏం...అట్లా అడిగారు..." వసంత ఆశ్చర్యంగానే అన్నది. "స్త్రీకి స్వాతంత్ర్యం వున్నది. వివాహ విషయములో ముఖ్యముగా స్త్రీ సమ్మతిలేనిదే పెళ్లి జరగనేజరగదు. ఇక మిగతా విషయాలుకూడా కాసేపు మరిస్తే, మీరు మీ మేనత్త కుమారున్ని పెళ్లిచేసుకోను అనటానికి గట్టికారణం ఏమన్నా వుందా..." ఈ సూటి ప్రశ్నకు తీవ్రతకూడా బాగానేవుంది.

వసంత ఇలాంటి ప్రశ్నకు సూటిగా సమాధానం ఇవ్వటానికి సిద్ధంగా లేదు.

"నేను చొరవచేత అడుగుతున్నాను. అంతే..." మళ్లీ సుజాత అన్నది. "అంటే వాళ్లందరూ యీ పెళ్ళిచేసుకోమని అంటున్నారని మీకు వ్యతిరేకమా, లేక సహజంగానే మీకు గల వ్యతిరేక కారణాలు వున్నాయా" మళ్లీ సుజాత వ్యాఖ్యానించింది.

ఈసారి వసంతకు అహం దెబ్బతిన్నట్లనిపించింది. కాని నిజానికి సుజాతకు చెప్పతగ్గ కారణాలు ఏమీ పైకి కనిపించటంలేదు. తన అంతరాత్మలో వున్న విషయం సుజాతకు అప్పుడే చెప్పటం యిష్టంలేదు. ఆ విషయాన్ని కూడా చెప్పేసి ఓ బలమైన కారణం వుంది. కనుకనే, నేను ఆ పెళ్ళికి ఒప్పుకోవటంలేదని చెప్పేద్దామనుకుంది. ఆవేశంలో ఓరహస్యం బైటపెట్టటం వసంతకు ఇష్టం కాకపోయింది. కొంత తమాయించుకుని, "ఒకళ్లు అవునంటే నేను కాదని అనటమే అనుకుంటున్నారా" అన్నది కొంచెం ఎత్తిపొడుపుగా.

సుజాతకూడా కొంచెం బాధపడింది.

"మీరు అట్లా అంటారని తెలిస్తే, నేను మీతో ఈ ప్రస్తావనే తీసుకు వచ్చేదాన్ని కాదు......" అన్నది సుజాత.

వసంత ఏమీ మాట్లాడలేదు.

సుజాత ఒకటి రెండుసార్లు మాత్రం, వసంతతో, నేను అట్లా అన్నందుకు యేమీ అనుకోవద్దని మాత్ర చెప్పింది. వసంత వెళ్ళిపోతూ "అబ్బే అదేం లేదులెండి" అన్నది.

వసంత వెళ్ళినప్పటినుంచి సుజాత తాను ఆ ప్రశ్న యెందుకు వేశానా అని పశ్చాత్తాప పడుతూనే వుంది. ఒకటి రెండు రోజులు, సుజాత, వసంత యెదుట పడటానికి జంకుతున్నట్లు కనిపించింది. వసంత అవుతే ఆ మాటల్ని ఆ నాడే మరిచేపోయింది. అందువల్లనే సుజాతను మళ్ళీ పాఠానికి రమ్మనమని పిలిచింది. ఆ రాత్రి ఎనిమిది గంటలదాక సుజాత పాఠం చెప్పుకుంటూనేవుంది. ప్రక్క గదిలోకి మెల్లిగా రవివచ్చి కూర్చున్నాడు. వీళ్ళిద్దరికి రవి కనిపించే లాగున కుర్చీవేసుకుని యేదో చదువుకుంటున్నాడు. వసంతకు చాలా కంటకంగా వుంది. సుజాతకు ఎంతో ఎబ్బెట్టుగా వుంది. తటాలున లేచి వెళ్లిపోదామనుకుంది కూడా. కాని వసంత యేమనుకుంటుందో అని తమాయించుకొని వూరుకుంది. రవి అక్కడినుంచి లేచి వసంతతో మాట్లాడటానికి వుద్యుక్తుడవుతున్నట్లు కనిపిస్తున్నాడు. వసంత మొహం చిటచిట లాడించింది. రవి, వసంత మొహంవైపు చూడనేలేదు. ఒకటి రెండుసార్లు మాత్రం రవి సుజాత మొహంలోకి అతి తీక్షణంగాను ఎంతో ఆప్యాయంగాను చూశాడు. సుజాతకు ముచ్చెమట్లు పోసినట్లయింది. వసంతకు కోపం యెక్కువయింది. కొన్ని క్షణాల దాకా ఎవరూ కూడా మాట్లాడలేదు.

"మీ యింటికి వెళ్ళిపోదాం రండి" వసంత చివాలున లేచింది. సుజాత కూడా వెంటనే లేచింది. ఆనాడు మధు అప్పటికే యింటికి వచ్చేశాడు. కాని మధును చూడకుండానే యిద్దరుకూడా గదిలో ప్రవేశించి యేవేవో మాట్లాడుకుంటున్నారు. ఇంతలోకే పావని ప్రక్కమీద మసిలింది. సుజాత రెండడుగులు వేసి సావిట్లో మంచం దగ్గరకు వెళ్లింది. మెల్లిగా వసంత లేచి అద్దంవైపుకు వెళుతుండగానే కుర్చీలో కూర్చున్న మధు కనిపించాడు. అద్దంలో మధు మొహం స్పష్టంగా కనిపించింది మధుకు. ఇట్టే నిలబడి చూస్తోంది. వెంటనే సుజాత గది గుమ్మంలోకి రాగానే, వసంత మధులు చాలా దగ్గరగా కనిపించారు. సుజాత యెంతో చిన్నబుచ్చుకుంది. వసంత చనువుగా పక్క కుర్చీ లాగి కూర్చుంది. సుజాత అది సాహసమే అనుకుంది. తాను అక్కడ నుంచి వెళ్లిపోదామనుకుంది. కాని తానుకూడా అక్కడినుంచి వెళ్లిపోతే

మరింత యిదిగా వుంటుందని అట్లాగే నిలబడిపోయింది. మధు వీటినేమీ పట్టించుకోనట్లు ప్రవర్తిస్తున్నాడు. తన ఫైల్సు తిరగేస్తూ మామూలుగానే సుజాతకు ఫైల్సు అందించాడు. వసంతకూడా, మధుతోబాటు లేవబోతుంటే, కూర్చోండి మీరు. నేను వెళ్లుతున్నాను, అన్నాడు మధు. వసంతకు యెంతో ఆప్యాయంగావుంది. ఆ మాట, మధు కళ్లల్లోకి చూసింది. మధుకు యేమిటోగా నిపించింది. సుజాతకు యెటూ మాట్లాడటానికి తోచటంలేదు. తప్పనిసరిగా అక్కడే కూర్చుని యేదో పాఠం చదువుకుంటున్నట్లు పుస్తకాన్ని తిరగేస్తోంది. కొంచెంసేపు ఆగి వసంత తానంతట తానే వెళతానండి అంటూ సుజాత దగ్గర శలవు తీసుకుంది. తీరా గుమ్మందాకా వెళ్ళి, "నమస్తే, వస్తానండి" అంటూ మధువైపుకు తిరిగింది వసంత. మధుకూడా అప్రయత్నంగానే నమస్కారాన్ని స్వీకరించాడు.

సుజాత, మధులిద్దరు తర్కించుకుంటున్నారు వసంతను గురించి. "మేనత్త కొడుకుట, డాక్టరు. అతన్ని పెళ్ళిచేసుకోటానికి యిష్టంలేదట. మరేం కారణమో" సుజాత ఆపేసింది.

"మొత్తంమీద చదువుతే చదువుకుందిగాని, మిగతా విషయాల్లో అట్టే చదువుకున్నదాని మాదిరిగా ప్రవర్తించటంలేదు......" మధు వ్యాఖ్యానించాడు.

"ఇంకా పరాయివాళ్ళెవరైనా చూస్తే ఏదైనా అనుకుంటారు. అయినా చదువుకున్న పిల్ల ఆ మాత్రం తెలీద్దుటండీ..." సుజాత కోపాన్ని అణుచుకుంటూ అన్నది.

"మనం చొరవగా వుంటుంటే అమె వుంటుంది. దాంట్లో తప్పేమిటి అనుకునేవాళ్లు యేవో అనుకుంటూనే వుంటారులే. దానికి మనం యిదపటం యెందుకు..." మధు నిర్లక్ష్యభావాన్ని ప్రదర్శించాడు.

## II

రాత్రి పది దాటిపోతూవుంది. సుజాత కంటిరెప్పలు మెల్ల మెల్లగా అంటుకుంటున్నాయి. దీపం ముందర కునికిపాట్లు పడుతోంది. పావని గాఢ నిద్రపోతోంది. మధుకుకూడా ఆనాడు ఫైల్సుజోలికి పోవటానికి యిష్టంగా లేదు. ఆయన మనస్సు ఆరేళ్లనాటి దృశ్యాల్లో విహరిస్తోంది. ఎదురుగుండా సుజాత అతి సిగ్గుగా తలవంచుకుని తనవైపుకు వస్తున్నట్లు కనిపించింది. ఏవో నవ్వులు కిలకిల వినిపిస్తున్నాయి. తాను అతి తీక్షణంగాను, ఆప్యాయంగాను సుజాత కళ్ళల్లోకి చూస్తూ. యేదో ఆహ్వానిస్తున్నట్లు సుజాత మొహంలోకి చూశాడు. తనకేదో భయంగా వున్నట్లు, సుజాత బెరుకుగావున్నట్లు కనిపిస్తోంది. హఠాత్తుగా ఒక్కసారి తూలిపడ్డాడు. అబ్బ అంటూ కళ్లు నులుపుకుని చూసేటప్పటికి ఎదురుగుండా కుర్చీ దగ్గర సుజాత నిద్రపోతోంది. మెల్లిగా మధులేచి, సుజాత దగ్గరకువెళ్లి, యెంతో ప్రేమగా, ఆమె చెయ్యిపట్టుకుని, నిద్రలేపటానికి ప్రయత్నంచేస్తున్నాడు. సుజాత కూడా అటు యిటు కదిలి, మెల్లిగా కళ్లు తెరిచింది. మధు ఎంతో సంతోషంగా సుజాతవంక చూస్తూ నవ్వాడు. సుజాత కళ్లు బాగా తెరచి, పెదిమల మీదికి నవ్వు రానిచ్చింది. మెల్లిగా యిద్దరు లేచి నుంచున్నారు. తూలుతూ తూలుతూ సుజాత మెల్లగా అడుగులు వేసుకుంటూ గదివైపుకు నడిచింది. మధు సావిట్లో దీపం తగ్గించేసి, పావనికి దుప్పటి పూర్తిగా కప్పేశాడు, రెండుసార్లు వీపు తట్టి. పావని తటాలున "అమ్మా" అంటూ లేచింది. మధు, పావనిని నిద్ర వోపటానికి యెంతో ప్రయత్నంచేశాడు. ఎందువల్లనో కాని పట్టిన మారాము వదలలేదు పావని.

"ఎప్పుడూ ఇంత మారాము పట్టలేదు. బహుశా ఏమన్నా కలవరించిందో యేమో"! అంటూ సుజాతకూడా పావనిని దగ్గరకు తీసుకుంది. కొంచెంసేపు యిద్దరూ సముదాయించిన తర్వాత, పావనికి మళ్లీ నిద్రపట్టింది. సుజాత, మధులు నవ్వుకుంటూ లేచారు. గది గుమ్మం దగ్గరకు వెళ్లేటప్పటికి వీధి తలుపు చప్పుడయినట్లనిపించింది. సుజాతకు వినిపించినాకూడా ఏదో పరధ్యానంగానే ముందుకు సాగింది. మళ్లీ తలుపు చప్పుడయింది. మధు వెనక్కు తిరిగి ఆగాడు.

ఇంకోసారి తలుపు చప్పుడయింది. మధు గబగబ వెళ్లుతున్నాడు. ఈ అర్ధరాత్రి ఎవరండీ మనింటికి వచ్చేది. పేరు అడగండి ఎవరో. అప్పుడే తలుపు తీయకండి అంటూ సుజాతకూడా వెనకనే వెళ్లింది. మధు గట్టిగానే 'ఎవరని' అడిగాడు.

"మధుసూధనరావుగారు..." అంటూ సన్నటి గొంతికతో ధ్వని వినిపించింది.

గొంతుక అవుతే మధు గుర్తు పట్టలేక పోయాడు. కాని తన పేరు పెట్టి పిలవటంతో, తనకు తెలిసిన మనిషే అని తలుపుతీశాడు. మధు మనిషిని చూసిన తర్వాతకూడా గుర్తు పట్టలేకపోయాడు. సుజాతకు అతనిని ఎక్కడో చూసి నట్లనిపించింది. కాని వెంటనే ఫలానా అని సుజాతకు జ్ఞాపకం రావటంలేదు. ఎంతో ఆలోచించుతోంది అతను యెవరా అని. కాని యెంతసేపటికి గుర్తు రావటంలేదు. మధు నీళ్లు నములుతూ 'క్షమించాలి. నాకు బాగా గుర్తు రాలేదు' అన్నాడు.

గోపాలం ఏమాత్రం బెరుకు లేకుండానే, మిమ్మల్ని నేను బాగా యెరుగుదున్నాను లెండి అంటూ లోపలికే వచ్చేస్తున్నాడు. మధుకు వేరే గత్యంతరం లేకపోయింది. గోపాలం లోపలికివచ్చేశాడు. సుజాత తలవంచు కుని సరాసరి గదిలోకి వెళ్లిపోయింది. సుజాత మనస్సులో యితని ఆచూకి గురించే బాధపడుతోంది.

"నేను పొదుగూరునుంచి వచ్చాను. ఈ అర్ధరాత్రి యెటు వెళ్ళటానికి అవకాశంలేదు. ఇటు యెక్కడైనా యీ రాత్రి తలదాచుకోవటానికి వీలుం టుందేమోనని వెతుక్కుంటూ వస్తుంటే మీ ఇల్లు చూపించారు. వెంటనే వచ్చేశాను. అంతే..." ప్రాధేయ పడుతున్నట్లు గోపాలం కాళ్లావేళ్లా పడ్డాడు.

"ఆ మాట మొట్టమొదట చెపితే మాత్రం వచ్చిన తంటాయేమిటి నేను కాదంటానా..." మధు గోపాలం వంక చూశాడు.

"నన్ను క్షమించండి, అనవసరంగా మీకు శ్రమ యిచ్చాను..." గోపాలం నటిస్తున్నాడు.

ఇక్కడ పడుకోండి అంటూ ఓ చాప తెచ్చియిచ్చాడు మధు. అదే పరమ సంతోషంగా స్వీకరించాడు గోపాలం.

"ఈ రాత్రికి యిక్కడ పడుకోవటానికి వచ్చాడుట..." మధు, ఆ వ్యక్తిని గురించి సుజాతతో చెప్పుతున్నాడు.

"ఎవరు, మీకు తెలుసా..."

"ఎవరో బాటసారి... పడుకోవటానికి వచ్చాడు.

"మనిషెవరో తెలుసుకోకండా వప్పుకోవటమేనటండి ఈ అర్థరాత్రి ఏం సాహసమండీ మీది..." సుజాత ఆశ్చర్యపోయింది.

"ఏం ఫరవాలేదులే... తెల్లారేటప్పటికి లేచిపోతాడు" మధు అతి తేలికగా అనేశాడు.

కాని సుజాతకు భయం ఎక్కువయిపోతోంది. భర్తతో ఫలానా అని చెప్పటానికి తనకేమీ గుర్తురావటంలేదు. సుజాతకు యెంతసేపు నిద్ర పట్టటంలేదు. మధు యిట్టే గుర్రు తీశాడు. ఒంటరిగా సుజాతకు యింకా ఆదుర్దా హెచ్చిపోతోంది. గభాలున మధును తట్టిలేపింది.

"నాకెందుకో భయంగా వుందండి. ఈ రాత్రి నేనూ నిద్రపోను మీరు నిద్రపోగూడదు..." సుజాత బ్రతిమాలుతుంది.

మధుయెంత ధైర్యం చెప్పినా సుజాత ఓపట్టాన వప్పుకునేటట్లులేదు. మధుకూడా కళ్లు జ్యోతుల్లాగ విప్పుకుని సుజాతకు యెదురు కూర్చున్నాడు. సుజాత పాపని వీపుమీద తట్టుతూ దిక్కుమొహం వేసుకుని కూర్చుంది.

కొద్దిక్షణాలు గడిచినాయో లేవో కొంచెం దూరంగా "దొంగ దొంగ" అని అరుపులు వినిపించినాయి. అరుపులు యింకా దగ్గరగా కూడా వినిపిస్తున్నాయి వెంటవెంటనే. మధుకు మనస్సు ఆగలేదు.

"సుజాత యిప్పుడేవస్తున్నా" అంటూ గదిలోంచి బైటపడ్డాడు మధు. మధుతోపాటు హడావిడిగా గోపాలంకూడా వాకిట్లోకి పరుగెత్తాడు. ఎక్కడ లేని ధైర్యం వచ్చేసింది సుజాతకు కూడా. పావని వున్నగది తలుపువేసేసి తాను గూడా వీథి గుమ్మందగ్గరకువచ్చి నుంచుంది. ఆదుర్దాగా నాలుగువైపుల తేర పార చూస్తోంది. ఎక్కడా మనిషి సంచారం కనిపించటంలేదు. అయితే దగ్గరగానే కేకలు వినిపిస్తూనేవున్నాయి. ఇంకొంచెం ముందుకు వెళ్లింది సుజాత వీధిలోకి. వీధి తలుపుచాటున నక్కివున్న గోపాలం మెల్లిగా యింట్లోకి వెళ్ళబోతున్నాడు. సుజాత యీసారి నిమిషంలోకి గుర్తుపట్టేసింది.

"నువ్వా! ఎందుకు వచ్చావు...ఎంతో భీకరంగా అన్నది సుజాత.

నదురు బెదురు లేకుండా గోపాలం అక్కడే నిలబడిపోయాడు. సుజాత యెంత గంభీరంగావున్నా, కాళ్లు చేతులు ఆడటంలేదు. ఏమీ చెయ్యటానికి తోచటంలేదు. ఇంట్లోకి వెళ్ళి తలుపు వేసుకుందామనుకుంటూంది కాని; గుమ్మంలోనే గోపాలం నిలబడివున్నాడు.

ఈ కేకలు విని వసంత తండ్రితోపాటు వాకిట్లోకి వెళ్లింది. కాని నాలుగు అడుగులు వేసేటప్పటికి తన తండ్రి యింకొంచెం దూరం వెళ్ళిపోయాడు. ఆయనతో వెళ్లలేక లోపల రవి వున్నాడని యింటికి వెళ్లక అక్కడే నిలబడి ఆదుర్దాగా చూస్తోంది వసంత.

మధు వాకిట్లోకి పరుగెత్తుకుపోవటం చూసిన రవి, మెల్లిగా మధు యింటివైపుకు వచ్చేస్తున్నాడు. సుజాతకు గోపాలానికి అట్టే యెడంలేదు. సుజాత యేదైనా చెయ్యటానికి సిద్ధపడి పోయినట్లు ఎంతో శాంతంగాను ధైర్యంగాను నిలబడివుంది. ఇంతలోనే రవి అక్కడికి వచ్చేశాడు.

సుజాత అనుకోకుండానే "వసంత కూడా వచ్చిందా" అని రవిని ప్రశ్నించింది.

రవి వుబ్బిపోయి ఇక్కడికి రాలేదు. ఇంట్లోనేవుంది అన్నాడు.

గోపాలం నిలువునా నీరయిపోయాడు.

'మీరెవరండి'...రవి గోపాలాన్ని ప్రశ్నించాడు. సమాధానం రాలేదు. సుజాతవైపుకు తిరిగి యిదే ప్రశ్న వేశాడు.

"నాకు తెలీదండి...వూరికే లోపలికి వచ్చేస్తున్నాడు..." యెంతో చనువుగా అన్నట్లు అనేసింది సుజాత.

రవికి చిర్రుమన్నది. గోపాలం చొక్కా పట్టుకుని ఒక్కలాగు లాగాడు. రెండు లెంపకాయలు బలంగా కొట్టేశాడు. గోపాలం వుక్కిరిబిక్కిరి అయి మళ్లీ అక్కడ కనిపించకుండా పరుగెత్తుకుని పోయాడు. తన ధైర్య సాహసాన్ని సుజాత దగ్గర పూర్తిగా ప్రదర్శించినందుకు రవికి యెంతో తృప్తి కలిగింది. సుజాత తన యింటికి వచ్చేటట్లు చేశాననికూడా సంతోషపడ్డాడు.

కాని సుజాతకు రవిమీద అట్టే నమ్మకంలేదు. పైపెచ్చు, వసంత అదివరకు రవినిగురించి చెప్పినవన్నీ జ్ఞాపకం తెచ్చుకుంటోంద. రవి, తనను అవతలివాడి దాడిలోంచి తప్పించిన మాటవుతే వాస్తవమే. అయినా, రవికి యివ్వాలసిన గౌరవంకూడా యివ్వలేక పోయింది. రవిమీద తనకున్న అభిప్రాయం, కనీసం కృతజ్ఞత చెప్పుకోవటానికి, యిష్టపడలేదు. మనస్సులో ఘర్షణపడుతోంది సుజాత. మనస్సులో సంతోషపడుతున్నాడు రవి. రవి చాలా పెద్దమనిషిగా ప్రవర్తించటానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఇంతలోకే యిద్దరు ముగ్గురు బజార్లో కనిపించారు. ఆ ధైర్యాన్నిబట్టి, తలుపుబైట గొళ్లెం పెట్టేసి, సుజాత, రవి వెనకాల నడుస్తోంది. రవి అతి నిరామయంగా తన యింట్లోకి వెళ్ళి తాను సుజాతను పూర్తిగా నమ్మించానని సంతృప్తి పడుతున్నాడు. అకాత్తుగా, వసంత తండ్రి, "అమ్మాయి యెక్కడ" అని రవిని ప్రశ్నించాడు. రవి క్రుంగిపోయాడు. సుజాత సరాసరి వసంత తండ్రి దగ్గరకు వచ్చి నిలబడింది.

"మా అమ్మాయి మీ ఇంటికివచ్చిందా" అంటూ ఆయన సుజాతను అడిగాడు.

సుజాత, తలెత్తి, రవి మోహంలోకి చూసింది. రవి మొహం వంచేసుకుని తప్పుకున్నాడు. సుజాత గజగజ వణుకుతూ ఆయనదగ్గరే నిలబడివుంది.

బైట గొళ్లెంవేసింది చూడక, మధు, వసంతులు తలుపు కొడుతున్నారు. ఎంతసేపటికి లోపల్నుంచి జవాబు రావటంలేదు. వసంత యేవేవో అడుగుతూనే వుంది. మధుకు వసంతను గురించిన చిరాకుకూడా యెక్కువయిపోయింది. వెంటనే మిమ్మల్ని యింటిదగ్గర దిగబెడతానని, మధు, వసంత యింటివైపుకు మళ్లాడు. వాకిట్లో సుజాత, వసంత తండ్రి నిలబడివున్నారు.

"అమ్మాయి మీ దగ్గరకు వచ్చిందా..." వసంత తండ్రి యెంతో ఆదుర్దాగా అన్నాడు మధుతో.

ఆ మాటలు చాలా కటువుగా వినిపించాయి సుజాతకు. వసంతకు చాలా యింపుగా వినిపించినాయి. శెలవుతీసుకుని యెవరిదోవనవాళ్లు వెళ్లిపోయారు.

"నీకు భయంవేసిందా..." ఎంతో నిదానంగా అడిగాడు మధు.

తన భర్తమీద యెంతైనా కోపం వచ్చింది సుజాతకు. తనని వంటరిగా వదిలిపెట్టి వెళ్ళిపోయాడని యెంతో వుక్రోషంకూడా వచ్చింది. సుజాత, మధు అడిగిన రెండుమూడు ప్రశ్నలకు యేవిధమైన సమాధానంకూడా యివ్వలేదు. మధు గ్రహించుకుని ఆటే ప్రస్తావన తీసుకురాలేదు. తన గదిలోకి సూటిగా వెళ్ళబోతుంటే, చప్పున ఆ రాత్రివచ్చినాయన మాట గురించి జ్ఞాపకం వచ్చింది. వెంటనే మధు వెనక్కు తిరిగి, ఆయన ఎక్కడ అన్నాడు.

"ఏమో నాకు తెలీదు..." అన్నది ముభావంగా సుజాత. సుజాతకు జరిగిన విషయం అంతా మధుకు చెప్పటం యిష్టంలేకపోయింది. సుజాతకు ఆ మనిషెవరో గుర్తు వచ్చినప్పటికి తన భర్తకు చెప్పటం అనవసరమనిపించింది.

"ఏమోలే దొంగను పట్టుకోవటానికి వెళ్ళాడేమొ..." అన్నాడు మధు యెగతాళిగా.

రాని నవ్వు తెప్పించుకుంటూ సుజాత కూడా మధుకు సంతృప్తిని కలిగించింది.

ఆనాడు రాత్రి నిద్రపోయినట్లే అనిపించలేదు. యిద్దరికీను.

సుజాతకు ఆనాటినుంచి, వసంత యింటికి వెళ్ళటానికి మనస్కరించలేదు. ఓ విధమైన హేయభావము రపిమీద యేర్పడిపోయింది. అలాంటి భావాన్నే, తాను వసంత ముందర వ్యక్తపరచటం భావ్యం కాదనుకుంది. పైపెచ్చు వసంత ప్రవర్తన, సుజాత మనస్సును తృప్తిపరచటం లేదు. ఆ యింట్లో వున్న ఇద్దరి మీద అలాంటి భావాలు పెట్టుకుని, సుజాత యెట్లా నిర్వహించుకోగలుగు తుంది. సుజాతకు యెటూతోచటం లేదు. తాను చదువుకోవటం కోసం వసం తతో సన్నిహితం యేర్పరచుకుంది. ఈనాడు ఈ కారణాలవలన తన చదువు మానుకోవటమే కాకుండా, వసంత కోపానికి గురి కావలసి వుంటుంది. అయితే చదువు కోసమే అని అదివరకు మాదిరిగానే వుంటుంటే, యే ఒక నాటికైనా వసంతతో తగాదా పెట్టుకోవలసి వస్తుందేమోనని సుజాత భయపడిపోతోంది. ఒకటి రెండు రోజులు యీ ఆలోచనలతోనే అక్కడికి వెళ్ళలేదు.

ఆనాడు సుజాత—పావనికి జడవేస్తుండగా, వసంత తలుపుతట్టి పిలిచింది. వస్తున్నా అంటూ సుజాత లేచి తలుపు తీసింది.

"ఏమండీ మీరు బొత్తిగా మా యింటికి రావటం మానేశారే..." అన్నది వస్తూన్న వసంత.

"క్షణం తీరిక లేకుండా వుంది. యీ రెండు రోజుల పట్టి, లేకపోతే రావటానికే ముందండి..." సుజాత సమయోచితంగా అనేసింది.

"ఎటాగోట్లా తీరిక చేసుకుని పాఠానికన్నా రాకపోయారు."

"అందుకనే నేను మొదటే అన్నాను. పెళ్ళి అయిపోయిన తరువాత, మళ్ళీ చదువు మొదలు పెట్టాలంటే మహా కష్టమండి. ఈ జంఝాటమంతా వుంటుందే మరి..." సుజాత యేనిర్ణయానికీ రాకుండానే, చదువు విష యంలో ఆ విధంగా అనేసింది.

"సంసారానికి, చదువుకు సంబంధం యేమిటండి. దేని గొడవదానిదే లెండి..." వసంత నవ్వింది.

వసంత నవ్వుకు అర్థంయేమిటో సుజాత గ్రహించింది కాని సుజాత దానికి సమాధానంగా యేమీ మాట్లాడలేదు. వసంత, పావని వంక అట్టె

చూస్తూ అట్లాగే కూర్చుంది. వసంత మనస్సులో అనేక వ్యూహాలు చెలరేగుతున్నాయి. ఎన్నెన్నో ఆలోచనలు, అభిప్రాయాలు వసంతను పరీక్షచేసి పోయినాయి. వసంత నిబ్బరంగానే వాటిని స్వీకరించి అవగాహనం చేసుకుని, తనకు అవసరమైన భావాన్నే జీర్ణంచేసుకోవటానికి ప్రయత్నంచేస్తోంది. కాని ఎక్కడో పొంగి పొరలివస్తున్న ఆవేదనను ఆపటం మాత్రం వసంతకు శక్యం కాకపోయింది. గబాలున పావనీ రా అమ్మ అంటూ వళ్లోకితీసుకుని, గట్టిగా హృదయానికి వత్తుకుంది. పావని మీద అంత గాఢమైన ప్రేమ, వసంత ప్రదర్శిస్తుండగా సుజాత చూడటం యిదే మొదటిసారి. సుజాతకు ఎంతో ఆశ్చర్యంవేసింది. సుజాతకూడా వసంత హృదయాన్ని గ్రహించినట్లే ఆకాసేపు ప్రవర్తించింది. వసంతమీద యెంతో జాలివేసింది. వసంత ఆవేదన, బాధ సుజాతకు పూర్తిగా అర్థమయినాయి. వసంతకు ఈ విషయంలోనే అదివరకు ఓసారి చెప్పేద్దామనుకుంది. కాని పరిస్థితులు అనుకూలించలేదు. సుజాత ఆ ప్రస్తావన తీసుకురాలేదు. ఇప్పుడు మాత్రం, వసంతను ఓదార్చాలనుకుంది. ఎంతో బాధపడుతూ వసంతతో "ఏమండీ మీ మేనత్తకొడుకు విషయం యేమయింది" అన్నది. వసంత, తొట్రుపడుతూ ఆ విషయాన్ని మార్చేద్దామని వ్యర్థ ప్రయత్నం చేసింది. సుజాత రెట్టించి అడిగింది మళ్లీ. వసంతకు ఏమీ చెప్పటానికి తోచలేదు.

"ఆ గొడవలన్నీ ఇప్పుడెందుకులెండి...ఇంతకీ రేపటినుంచి మీరు వస్తారుగాదుమరి..." పూర్తిగా ఆ సంభాషణ మార్చేసింది వసంత. సుజాత కూడా, వసంత మనస్సు గ్రహించి అట్టే రభసకాకుండా "అట్లాగే వస్తానులెండి" అంటూ టూకీగా ముగించేసింది.

సరాసరి వసంత తన గదిలోకి వెళ్ళి అమాంతంగా మంచంమీదపడి, దిండు అడ్డం పెట్టుకుని వెక్కి వెక్కి యేడవడం మొదలు పెట్టింది. వసంతకు యేమీ తోచటంలేదు. తన మనస్సులో అవుతే యేవేవో కోర్కెలు యేవేవో మోజులు అందరి ఆడవాళ్లకు వున్నట్లేవున్నాయి. కాని తాను చదువుకున్న ఆడది. అందువల్లనే మిగతా ఆడవాళ్ళకంటె తాను తెలివిగా ప్రవర్తించగలనని ఇతరులకు చెపుదామనే ఆవేశం మాత్రం పూర్తిగా ఉన్నది. కాని

వ్యక్తపరచటంలో ఏ విధమైన నిర్ణయము తీసుకోలేక పోతోంది. తన నిర్ణయం సుజాతకు తృప్తికలిగిస్తుందోలేదో తెలీదు. తన తండ్రి ఆమోదిస్తాడని నమ్మకం లేదు. తనను ఎరుగున్నవారు సంతోషించని యేనిర్ణయంకూడా తనకు తృప్తినివ్వదేమోనని వసంతకు భయం. అందర్నీ కాదని తాను ఇంకోదారి త్రొక్కటానికి గల కారణాల మాట అటుంచినా, సాహసం మాత్రంలేదని పూర్తిగా వసంతకు తెలుసు. తాను అనుకున్నట్లు చదువుకుందే కాని, తాను అనుకున్నట్లు మిగతా విషయాల్లో చెయ్యలేక పోతోంది. ఎవరికైనా సలహా అడుగుదామన్నా, తన ఆత్మ గౌరవానికి భంగమని వసంత మథనపడిపోతోంది. అడగందే ఇచ్చే సలహాలను పాటించటం గౌరవభంగం. సుజాత విలువైన సలహా ఇస్తుందనే నమ్మకం వున్నా ఆమెను అడగటానికి మాత్రం మనస్సు వప్పటంలేదు వసంతకు. ఏమయినా సుజాత దగ్గరకు వెళదామనుకుంది.

మర్నాడు మధ్యాహ్నం వసంత సుజాత యింటికి వెళ్లింది. ఇంత మిఠాయి, ఇన్ని పూలు పావని చేతిలో పెట్టి గట్టిగా ముద్దు పెట్టుకుంది. వసంత మొహంలో అదో విధమైన దైన్యం తాండవమాడిపోయింది. పావనిని గట్టిగా దగ్గరగా లాక్కొని వళ్ళో కూర్చో పెట్టుకుంది.

సుజాత ప్రక్కకుర్చీలో కూర్చుంది.

వసంత ఒకటి రెండు నిముషాలుపావని మొహంలోకే చూస్తూ యేమీ మాట్లాడలేదు. సుజాత మనస్సులో యేవేవో వూహలు, ఆలోచనలు చెలరేగు తున్నాయి. వసంత మనస్సు బాగా అర్థంచేసుకున్నాననే తృప్తి సుజాతకు కలిగింది. ఏదైనా సలహాగా వసంతతో చెపుదామనుకున్నది కూడా.

వసంత ఆ క్షణంలోనే సుజాత వైపుకు యెంతో అసూయగా చూసి నట్లు చూసింది. సుజాత అట్టే గమనించలేదు.

“బాగా చదువుతున్నారా...” వసంత ఎంతో నీటుగా అడిగింది.

“చూస్తున్నారుగా. యిదివరకు. ఏదో పనులు, చదువు అట్టే సాగటం లేదండీ” సుజాత మామూలుగానే సమాధానం యిచ్చింది.

"ఆ పనులతో పాటే చదువు. అశ్రద్ధ చేస్తే ఎట్లాగండి..." ఆరిందాలాగా అన్నది వసంత.

సుజాత ఒక్క క్షణం ఆలోచిస్తున్నట్లు వసంత మొహంలోకి చూస్తోంది. ఆ ప్రస్తావన వసంతతో ఎట్లాగా తీసుకురావటం అని దీర్ఘంగా ఆలోచిస్తోంది.

"ఈ సంసారంలో పడిన తర్వాత చదువులు సంధ్యలు అంటే కష్టమేనండి..." సుజాత తాను తేదలచుకున్న సంభాషణకు యిది నాంది అనుకుంది.

"అలాంటి లక్షణాలు, అలాంటి గుణాలు, అంత ప్రేమవున్న మగవాడు మాటలతో దొరుకుతాడుటండీ. గుమాస్తా అయితేమాత్రం యేం..." సుజాత మొహంలో మార్పు, వసంతకు ఇంకా చెప్పనివ్వలేదు.

తన భర్తను తనయెదుట పరాయి స్త్రీ స్తోత్రం చెయ్యటం సుజాతకు ఏమాత్రం యిష్టంలేదు. అనవసరంగా ఆ ప్రస్తావన తెచ్చానేనని పశ్చాత్తాప పడింది. ఎట్లాగైనాసరే వసంతను ఇంకా ఈ విషయాన్ని గురించి మాట్లాడకుండా చెయ్యాలని ప్రయత్నం చేస్తోంది సుజాత. వసంతవుతే మాత్రం ఏవిధంగానైనా సరే ఓ అవకాశం తీసుకుని మధును గురించిన తన అభిప్రాయాన్ని సూటిగా చెప్పేద్దామనుకుంటోంది. సుజాత సహనం అంతమొందే పరిస్థితి వచ్చేస్తోంది.

"ఏవమ్మా!...పెద్దవాళ్లు చెప్పినదాంట్లో తప్పేముంది. యమ్. బి. బి. యస్. పరీక్ష ప్యాసయ్యే డాక్టరుగారి భార్య అంటె యెంత గౌరవం, యెంత మర్యాద...మీ అభ్యంతరం ఏమిటో అర్థంకాదు..."

సుజాత చాలా తీవ్రంగా అడిగింది.

"నేను పెళ్లి చేసుకోబోయేది డాక్టరు వృత్తిని కాదు. నా మనస్సుకు నచ్చినవ్యక్తిని..." వసంత యింకొంచెం తీవ్రంగా అన్నది.

"మీ బావలో వున్న లోపాలేమిటో నాకు అర్థంకావటంలేదు. అసలు మీ అభిప్రాయం అంతకంటె అగమ్యగోచరం." సుజాత ఆ స్థాయిలోనే అన్నది.

"మా బావలో వున్న గుణగణాలు మీకు తెలిసినంత నాకు తెలియవు లెండి..." ఎంతో వెటకారంగా అన్నది వసంత.

సుజాతకు చర్రున మండింది. అహంకారంతోపాటు ఆవేశంకూడా వచ్చేసింది. కాని ఆలోచన అడ్డం వచ్చేటప్పటికి సుజాత తొందరపడి యేమీ అనలేకపోయింది. ఎంతో తమాయించుకుని, ఆత్మగౌరవాన్ని చంపుకుని ఆ క్షణం ఓ ఘోరమైన నరకాన్ని అనుభవించినట్లు బాధపడింది.

సుజాత ఒక్కమాటకూడా అనక పోయేటప్పటికి, వసంతకు గాభరా పుట్టింది. తాను అన్నమాటలోని ధ్వని చాలా వికృతంగా వుంటుందని తనకు తెలియనిదికాదు. తొందరపడి అన్నమాటకు వెంటనే క్షమాపణ కోరుకునే ధైర్యం లేకపోయింది వసంతకు. ఇంకోమాటలోకి పోనిద్దామనే ప్రయత్నంలో..."పెళ్లికి ప్రేమ ముఖ్యం. ఆ అనురాగం లేకపోయిన తర్వాత పెళ్లి చేసుకుంటే మాత్రం యేంలాభం..." అన్నది వసంత.

సుజాత కోపాన్ని అణుచుకోవటానికి యింకా ప్రయత్నం చేస్తోంది.

రవిని పెళ్లి చేసుకోవటానికి తాను యిష్టపడక పోవటానికి యెన్నో కారణాలు వున్నాయని యేవేవో చెప్పుకుంటోంది.

సుజాత శాంతించలేదు.

"రవిమీద ప్రత్యేకమైన అనురాగం తనకులేదని, అతను తన ప్రేమకు పాత్రుడు కాడని అన్నది వసంత.

సుజాత యేమీ మాట్లాడలేదు.

"నేను యేవుద్దేశంతోనూ యేమాట అనలేదన్నది వసంత."

సుజాత ప్రవర్తనలో యేమీ మార్పు కనిపించలేదు.

రవిని పెళ్లిచేసుకోకపోటానికి కారణం తాను రవిని ప్రేమించటంలేదని, తాను యింకొకతన్ని ప్రేమిస్తున్నానని చెప్పింది వసంత. ఈ రహస్యం బైట పెట్టినతర్వాత సుజాత మళ్లీ మామూలుగా వుంటుందనే వుద్దేశంతో చెప్పేసింది. లేకపోతే యీ రహస్యాన్ని యెవరితోనూ చెప్పదలచుకోలేదు.

ఈ విషయంకూడా సుజాతకు అంత ముఖ్యంగా కనిపించలేదు.

వసంత లేచి నిలబడింది. సుజాత దగ్గరకు మెల్లిగా అడుగువేసింది. తనను ప్రాధేయపడటానికి వస్తోందని సుజాత తెలుసుకుంది. హఠాత్తుగా తలుపు నెట్టుకుంటూ మధు యింట్లోకి వచ్చేశాడు. వసంత తత్తరపడుతూ వెళ్లివస్తానండీ అన్నది.

పావనిని దగ్గరకు తీసుకుంటూ వాకిటి తలుపుదాక సుజాత వెళ్లింది. ఓ సారి మధు మొహంలోకి తొంగిచూసి, వసంత తన యింటికి వెళ్లిపోయింది.

"ఏమిటి అట్లావున్నావు..." మధు ఆట్టే పట్టించుకోకండా గదిలోకి వెళ్లిపోయాడు. తండ్రి వెంటనే పావనికూడా వెళ్లిపోయింది గదిలోకి.

'ఏంచేస్తున్నావు...మీనాన్న వుత్తరంవ్రాశాడు. సనత్ వడుగుట...' మధు ఆవుత్తరాన్ని పావనికి యిచ్చాడు అమ్మకు యివ్వమని.

పావని యెంతో సంతోషంతో గంతులు వేసుకుంటూ తల్లిదగ్గరకు వెళ్లింది.

"వ్యవధిలేదు. ఈ సాయంత్రమే ప్రయాణం. అన్నీ సర్దేశెయ్యి... నేను స్టేషనుకువస్తా..." మధు గదిలోంచి వస్తూనే అన్నాడు.

"అట్లా అవుతే మీరు రారా..." సుజాత యెంతో ఆదుర్దాగా అడిగింది.

"నా కెక్కడ తీరికలే...పైగా యిప్పుడు పనికూడా యెక్కువయింది. పైవారం అవుతే యేమైనా వీలుచేసుకునే వాడ్నేమోకాని యిప్పుడు మాత్రం నేను రావటానికి వీల్లేదు..." మధు కోటు చిలకకొయ్యకు తగిలించాడు.

"ఏమోనండి మీరు రాకపోతే నాకు వెళదామని లేదండి..." చప్పున అనేసింది సుజాత.

"మీ తమ్ముడు వడుగుకు వెళ్లటం నువ్వు ముఖ్యంగాని, నాదేముంది. నువ్వు వెళ్లకపోవటమేమిటి..." మధు యెంతో తేలికగా అనేశాడు.

"నావంట్లో సరిగ్గా లేదండీ..."

"అట్లా అవుతే తప్పక వెళ్లాలి..."

"ఈ చదువు వకటి పెట్టుకుంటివే...మరి..."

"ఆ నాలుగురోజులు మీ అన్నయ్యచేత పాఠాలు చెప్పించుకోరాదు" మీకు భోజనం యిబ్బంది కాదు. హోటలుభోజనం పడదే మీకు..."

"ఈ నాలుగురోజులు ఫరవాలేదు..."

'వెళ్లినతర్వాత నాలుగు రోజుల్లో రావటం సాధ్యమవుతుందా యేమిటి.' కాకపోతే యింకా నాలుగు రోజులు వుంటావు అంతేనా..."

"ఎట్లాగైనా మీరుకూడా వస్తే బాగుంటుందండీ..." క్రొత్తవిషయం యేమీ చెప్పలేకపోయింది సుజాత.

"మళ్లీ అదేమాట, నిన్ను వెళ్లమంటున్నాకదా..." మధు కొంచెం విసుగ్గా అన్నాడు.

సుజాత వూరువెళ్లకండా ఆగుదామని విశ్వప్రయత్నం చేస్తోంది. మధుకు సూటిగా యేమీ చెప్పలేక పోతోంది. మధు శతవిధాలా భార్యను పిల్లను పంపుదామనే కృతనిశ్చయంలో వున్నాడు.

"ఎవరో తలుపుచాటున వున్నట్టున్నారు చూడు..." మధు తలుపు వైపుకు చూశాడు.

సుజాత రెండడుగులు వేసిందోలేదో వసంత చిరునవ్వు నవ్వుకుంటూ లోపలికి వచ్చేసింది.

'మీరేదో మాట్లాడుకుంటున్నారు కదా అని నేను అక్కడే వుండిపోయాను... నేను వూరు వెళ్లుతున్నాను. మీతో చెపుదామని వచ్చాను." అంది వసంత.

సుజాతకు అనుకోకండా యెంతో శక్తి వుత్సాహం వచ్చేసినాయి.

"మళ్లీ యెప్పుడు వస్తారు. మేము యివ్వాళ సాయంత్రమే వూరు వెళ్లుతున్నాం" అన్నది సుజాత.

"ఓ వారంలోపునే తిరిగి వస్తాను. మీరెక్కడికి వెళ్లుతున్నారు" ఆదుర్దాగా అడిగింది వసంత.

"మా తమ్ముడి వడుగుట... వెళ్లుతున్నాం" సుజాత మొహం యెంతో విప్పారింది.

'వసంత దొర్లుకుంటూ సంతోషంలో మునిగిపోయింది. వసంత వాకిట్లోకి వెళ్లిపోంగానే తలుపు బిగించేసి, సుజాత పెట్టె సద్దుకోవటం మొదలు పెట్టింది. మధు యేమీ గమనించటంలేదు.

"ఆ... నేను చెప్పాలా. వెళ్లి ఓ వారం లోపున వచ్చేసేయండి. పని వత్తిడివలన రాలేకపోయాడు. ఏమీ అనుకోవద్దని మీ నాన్నతో చెప్పు ఇదిగో యీ డబ్బు నీ దగ్గర వుంచు" మధు నాలుగు నోట్లు అందిచ్చాడు.

సుజాత సంతోషం పట్టలేకపోతోంది. తాను పుట్టింటికి వెళ్లటానికి సావకాశం కల్పించిన వసంతను ఎంతో తలుచుకుంది.

చకచక నాలుగు గబగబ సద్దేసి రైలువేళ యెప్పుడు అవుతుందా అని యెదురుచూస్తూ కూర్చుంది సుజాత. పావనికి రైలు ప్రయాణం అంటే యెంతో వుబలాటం. వూరు వెళ్లుతున్నారని తెలిసినప్పటినుంచి ప్రక్కింటి వాళ్ళింటికిపోయి తన ప్రయాణం విషయం యెంతో బ్రహ్మాండంగా చెప్పుకుపోతోంది.

గోడ గడియారం అయిదుగంటలు ఖంగు ఖంగుమని కొట్టేసింది. మధు వాకిట్లోకి బండి తెచ్చిపెట్టాడు. సుజాత పావని యెంతో ఉత్సాహంతో బండీ యెక్కేశారు. మధు వీధితలుపు తాళంవేసి బండీవెంట నడుస్తున్నాడు.

స్టేషన్లో జనం కిక్కిరిసి వున్నారు. బండీలోంచి దిగిన జనం మెల్లి మెల్లిగా వూళ్లోకి వెళ్లిపోతున్నారు. బండీకోసం వచ్చిన జనం, పట్టాల వైపుకు బండీ యెప్పుడు వస్తుందా అని ఆదుర్దాగా నిరీక్షిస్తున్నారు. మధు టిక్కెట్లు కొని ప్లాటుఫారంమీదికి రాంగానే, సిగ్నలుచెక్క వంగిపోయింది. కొంత

మంది పెట్టెలు పట్టుకొని లేచి నిలబడ్డారు. కొంతమంది తత్తరపడుతూ అటు యిటు పరుగెత్తుతున్నారు. పెట్టెమీద సుజాత కూర్చునివుంది. ప్రక్కనే మధు నిలబడ్డాడు. మధు చెయ్యిపట్టుకొని పావని, రైలు యెటునుంచి వస్తుంది నాన్నా అని అడుగుతోంది.

"స్టేషనుకు బహుశా గోపీకాని, శేఖర్ గాని వస్తారులే...జాగ్రత్తగా దిగి వెళ్లంగానే ఓ వుత్తరం వ్రాయి."

"వాళ్లు రాకపోయినా నేను యింటికి వెళ్లగలనులెండీ...అదుగో రైలొస్తోంది..." సుజాతకూడా లేచి నిలబడింది.

"పెట్టె తీసుకో నాన్నా"...పావని ఓ చేత్తో మరచెంబుపట్టుకుని అన్నది.

అమాంతం ఎక్కడినుంచో ఏదో వచ్చినట్లు, రైలు గభాలునవచ్చి, ఆగిపోయింది.

అదుర్దాగా, దిగేవాళ్లను దిగనియ్యకుండానే జనం తోసుకుంటూ యెక్కేస్తున్నారు.

మధు వీలుచేసుకుని ఓ పెట్టెలో సుజాతను, పావనిని యెక్కించాడు. తాను క్రింద నిలబడి యేవేవో రైలు ప్రయాణంలో వుండవలసిన రీతులు చెపుతున్నాడు. పచ్చజెండా గార్డుచేతులో యెగురుతోంది.

'ఇక రైలు కదులుతోంది జాగ్రత్త......' అన్నాడు మధు యింజను వైపుకుచూస్తూ.

ఒక్క క్షణంలో గబగబ అడుగులు వేసుకుంటూ వసంత యిక్కడకు వచ్చి వ్రాలింది.

'మళ్లీ వారంరోజుల్లో వస్తారుగాదు...' వసంత సుజాతను ప్రశ్న వేసింది.

'మీరు వూరుయెప్పుడు వెళతారు...' సుజాత జంకుతూ అడిగింది.

"నేను వెళ్ళటంలేదండీ, మానేశాను. మా బావ యీ బండిలోనే పట్నం వెళుతున్నాడు..." వసంత నవ్వుకుంటూఅన్నది.

రైలు ఇంజను గార్ధభ స్వరంలో గుండె దద్దరిల్లేటట్లు అరిచేసింది. సుజాత మాటలు యెవరికీ యేమీకూడా వినిపించలేదు.

ప్లాటుఫారం చివ్వరిదాక పోయేదాక, మధు వసంతలు అక్కడే నిలబడి, సుజాత పెట్టెవైపుకు చూస్తున్నారు. పావని యేదో గట్టిగా అరిచింది రైల్లోంచి. మధు సరేఅన్నట్లు చేతులూపేశాడు. ఇంకోసారి పెద్ద ధ్వనిచేసి రైలు చాలా చిన్నదయిపోయి చూస్తూండగానే అదృశ్యమయిపోయింది.

వసంత గిరుకున యింటికి తిరిగి వచ్చేసింది. వసంత మెదడులో ఎన్నో ఆలోచనలు కలవరపెడుతున్నాయి. గంటలతరబడి దీర్ఘంగా ఆలోచించటం మొదలుపెట్టింది. మాటిమాటికి సుజాతే జ్ఞాపకం వస్తోంది. సుజాత కూడా తనయీడే. ఆమెకంటె తాను యెక్కువగా చదువుకున్నదే. ఆస్తి కూడా బాగా ఉన్నదే కాని తనకంటె సుజాత యెక్కువగా యెందుకు సుఖపడుతోంది? ఈ ప్రశ్నే మాటిమాటికి వీపును తడుతూ వసంతకు చిరాకు కలిగిస్తోంది. సుజాతమీద అసహనం యెక్కువయిపోతోంది. ఒంటరిగా ఎంతోసేపు ఆలోచించినా అంతు కనిపించటంలేదు. తాను బి.ఏ. ఎందుకు చదివిందో ఆలోచించటం మొదలుపెట్టింది. ఎంతసేపటికి సమాధానం దొరకటంలేదు. తన ఆశయము మేమిటి తన ఆలోచన యేమిటి ఒక్కదానికి సరియైన సమాధానం దొరకటములేదు. ఈ సంఘంమీద, తన తండ్రిమీద, రవిమీద అందరిమీద కోపం పొర్లుకు వస్తోంది. ఎవరూకూడా తనకుయేమీ హాని చెయ్యలేదు. కాని అందరిమీద తనకు కోపం యెక్కువయింది. తనతండ్రి చెప్పినట్లు వినకూడదనుకుంది. రవిని పెళ్ళి చేసుకోకూడదనుకుంది. బి.టి. చదివి స్కూలు మాస్టరీపనిచేస్తే ఒక్కక్షణంలో ఆలోచన. స్కూలులో పంతులమ్మ అవటానికి బి.ఎ. చదవాలా! తన ఆలోచన తననే పరిహసించింది. తనకున్న

విజ్ఞానంయొక్క ఫలితం ఏమిటి తాను వుపయోగించుకోకపోయిన తర్వాత. పావని జ్ఞాపకం వచ్చింది. పావని చాలా మంచి పిల్ల. సుజాతకూమార్తె. వెంటనే వసంత వళ్లంతా జలదరించి పోయింది.

తనకున్న స్వాతంత్ర్యానికి, స్వేచ్ఛకు యెవరూ అడ్డుపడటం లేదు. తాను చదువుకుని స్వయంగా తాను నిర్వహించుకునేటట్లయితే అందరూ సంతోషించే వాళ్ళే కాని వసంత తీరని వ్యధపడుతోంది. తాను నిలవదొక్కుకోలేకపోతోంది. తన అసమర్థత కప్పిపుచ్చటానికి ఇతరులను నిందించటానికి ప్రయత్నం చేస్తోంది. తనకు ఉన్న విజ్ఞానం ఇతరులు లేదనుకుంటారేమోనని, యెంతో భయపడిపోతోంది. ఆ తాపత్రయంలో తాను చేస్తున్న పనులకు, తాను ఊహించుకుంటున్న ఆలోచనలకు, తన తెలివితేటలు యేమీ ఉపయోగపడటంలేదు. తాను సుజాత మాదిరి సుఖంగా లేకపోవటంవలన సుజాతపట్ల అసూయ పెంచుకుంటోంది. తాను యేమీ చెయ్యలేక పోతున్నానే అనే ఆదుర్దా, ఆవేశం, వసంతలో మూర్తీభవించినాయి. రవిని పెళ్లి చేసుకోవటం విషయంలో తన అభిప్రాయం ఎట్లాఉన్నా తన తండ్రి, సుజాత చెప్పటంవలన రవిని పెళ్ళిచేసుకోకూడదనే మంకు పట్టుదల పెంచుకుంది. తనకు మధులాంటి భర్తకావాలని కోరిక. మధులాంటి వాడు సుజాతలాంటి భార్య కావాలని కోరుకుంటాడేమోనని వూహించుకోలేక పోతోంది.

హఠాత్తుగా లేచి సుజాత ఇంటికి వెళ్దామనుకుంది. కాని సుజాత లేదు. ఆమె లేదని తనకు తెలుసు. తనకు తెలిసినట్లు మధుకు తెలుసు. ఇంకా ఏసాకుతో వెళ్లాలి. మళ్లీ తమాయించుకుంది.

రోజూ మధు ఆఫీసుకు వెళ్లే టైములో వసంత వచ్చి గుమ్మంలో నుంచుంటుంది. మధు చూసి చూడకుండా వెళ్ళిపోతూ వుంటాడు ఆఫీసుకు. తన వైపు కన్నెత్తైనా చూడకుండా వుండడం వసంతకు ఆత్మాభిమానం దెబ్బతిన్నట్లనిపించింది. కానీ వసంత చేసేదేమీ లేదు. పళ్లు పటపట మనిపించి లోపలికి వెళ్ళిపోయేది.

ఆ సాయంత్రం పెద్దగా ముస్తాబుచేసుకుని యెంతో ఉత్సాహంగా పాటలు పాడుకుంటోంది తనలో తాను.

"ఏమిటే అమ్మాయి యివ్వాళ యిట్లా వున్నావు..." తండ్రి అడిగాడు.

"ఇవ్వాళ క్లబ్బులో మీటింగు. నేను వెళ్తున్నాను..." వసంత చటుక్కున సమాధానం చెప్పేసింది.

"ఆ మూడుముళ్లు పడ్డతర్వాత, ఏమీటింగుకు వెళ్లినాసరే. చెపితే వింటేగా..." మెల్లిగా సావిట్లోకి వస్తున్నాడు వసంత తండ్రి.

వీధితలుపు ఫెటీలుమని వేసేసి, వసంత చకచక వెళ్ళిపోయింది.

ఆ ముసలాయన అట్లాగే తేరపార చూస్తూ నిలబడిపోయాడు.

అట్టహాసంగా మీటింగు జరగటానికి కావాలసిన సన్నాహాలన్నీ పూర్తి అయిపోయినాయి. వసంత హడావిడిగా వెడుతూ నలుగురితోను అతి చొరవగా మాట్లాడుకుంటూ వెళ్ళి ఓకుర్చీలో కూర్చుంది.

పరబ్రహ్మంతో రెండుమూడుసార్లు కల్పించుకుని యేవో ప్రశ్నలువేసింది. అతను ముక్తసరిగా సమాధానాలు ఇచ్చి తన పనేమిటో చూసుకుంటూ పోతున్నాడు. అమరేందర్ అతి చనువుగా వసంతతో మాట్లాడటానికి ప్రయత్నం చేశాడు. కాని వసంత అతి ముభావంగానే వుండిపోయింది. వసంతకు ఈ ఇద్దరివలన మనస్సుకు బాధేకలిగింది మనశ్శాంతిలేకుండాపోయింది. పరబ్రహ్మంతో మాట్లాడటానికి వసంత యెంత శ్రమపడాలసి వచ్చిందో అమరేందర్ని వదిలించుకోవటానికి అంత శ్రమపడాల్సివచ్చింది. మీటింగు అయిపోతోంది. ప్రత్యేకంగా ఆహ్వానించబడ్డ వాళ్లతో ఓ టీపార్టీకూడా జరిగింది. వసంతకు ఆవేదనయెక్కువైపోయింది. ఎంతో అవమానపడ్డట్లు తలవంచేసుకుని ఇంటికి వచ్చేసింది వసంత. పరబ్రహ్మంమీద ఎంతో కసి. అతనిమీద ప్రతీకారం తీసుకోవాలని గట్టి పట్టుదలగావుంది. అతనిమీద యెంత అనురాగం వుందో అంత

ద్వేషంకూడా ఏర్పడిపోయింది. కాని తాను చెయ్యగలిగిందేమీ కనిపించటం లేదు. ఇంట్లో వస్తువులన్నింటిని చిందర వందరగా చిమ్మేసి పెట్టెలన్నింటిని హడావిడిగా తీసేసి కొంపంతా నానాహంగామా చేసిపెట్టింది. ఆ ముసలాయన మాత్రం పెదిమ కదపకండానే, యేదో నిశ్చింతగావున్నట్లు వున్నాడు. తన తండ్రి మూకీభావం వహించటంకూడా తనను రెట్టించినట్లే అయింది. ఆ రాత్రం చెడ్డ చిరాకుపడిపోయి, పెద్ద వుక్రోషంవచ్చి బావురుమని యేడుస్తూ కూర్చుంది. తన ఏడుపు యితరులు వింటే తనకు అగౌరవమని, వెంటనే మనసును చిక్కబట్టుకుని, బింకంగా ఆలోచించుకోవటం మొదలుపెట్టింది.

ఆగోజు కారోజు ఆహంకారం, కోపం యెక్కువయి పోతున్నాయి వసంతకు.

మర్నాడు వంటరిగా సావిట్లో కూర్చుని తీవ్రంగా వుత్తరాలు వ్రాసేస్తోంది. వ్రాసిన వుత్తరాలు పదేపదే చదువుకుంటూ గుణించుకుంటోంది. ఆలోచన తెగటంలేదు. మధ్యమధ్య కొట్టేస్తోంది. ఇంతలో తలుపుతట్టిన శబ్దం వినిపించింది. చేతులో పెన్ను కాగితంమీద పెట్టేసి, వాకిటి తలుపు తీసింది. పోస్టుమన్ ఓ వుత్తరం యిచ్చి వెళ్ళిపోయాడు.

"మామగార్కి నమస్కారములు, నేను రెండు మూడు రోజుల్లో తిరిగి వచ్చేస్తున్నాను. నేను పట్నంలో గాని, మన వూళ్ళోగాని ప్రాక్టీసు పెట్ట దలచుకున్నాను. పెళ్లి విషయంలో యిన్నాళ్లనుంచి నీ మాట విని వేరెచోట యెక్కడా కూడా సావకాశం యివ్వలేదు. అందువలన వెంటనే యీసారి నేను అక్కడికి వచ్చేటప్పటికి యే విషయమూ నాకు తెలియపరిచినట్లయితే, దానినిబట్టి నా ముందు కార్యక్రమము నిర్ణయించుకో కలుగుతాను. నేను యీ వుత్తరం వ్రాసినట్లు వసంతతోకూడా చెప్పి సంప్రదించ కోర్తాను..."

ఇట్లు,
నీ మేనల్లుడు రవి.

వసంతకు పూర్తిగా చెమట్లు పోసేసినాయి. ఆ క్షణంలో రవే కనక అక్కడేవుంటే మింగేసేద్దామనేంత కసి వచ్చేసింది. ఉత్తరంవైపు, ఓసారి తేరపారచూసి చించి పోగులు పెట్టేసింది.

"అమ్మాయి...ఎవరే వచ్చింది..." వసంత తండ్రి అడుగులు వేసుకుంటూ వస్తున్నాడు.

"ఎవరూ లేరు నాన్న, గాలికి తలుపు చప్పుడయింది. అంతే..." వసంత మళ్లీ తన వుత్తరాల ముందర కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తోంది.

ఆ ముసలాయన వాకిట్లోకి వెళ్ళి అటు యిటు చూసి తలుపు గొళ్లెం పెట్టి లోపలికి వెళ్లిపోయాడు.

వసంత మోహం చిటచిట లాడించుకుంటూ తన గదిలోకి వెళ్లి పడుకుంది.

"అమ్మాయి...రవి వెళ్లి నాలుగు రోజులైంది. వుత్తరం ముక్కన్నా వ్రాయలేదేమో..."

"ఇక్కడున్న దాన్ని నన్ను అడుగుతే యేం తెలుస్తుంది. పట్నం వెళ్లిన తర్వాత నీ సంగతేనేమిటి ఆయనకు పట్టింది..."

"అట్లా అనకే అమ్మాయి వాడికి నేనంటే పంచ ప్రాణాలూను. వాడు వుత్తరం వ్రాయకుండా వుండే వాడుకాడే...అవును కాని అమ్మాయి నేనో మాట అడుగుతాను చెపుతావా..."

"నువ్వు అడగండే..."

"చిన్నపిల్లవి నీకు అనుభవంలేదు. నేను చెపుతున్నాను. విను, నేను చెప్పేదంతా నీ బాగుకోరే..."

"నేను చిన్న పిల్లని. నాకేం తెలీదు నువ్వేమో పెద్దవాడివి నీకేమో అన్నీ తెలుసు. నేను చేసేదంతా నా చెడుపుకోసం, నీవు చెప్పేదంతా నా బాగుకోసం, అంతేనా...ఇంకేమన్నా వుందా..."

"నీ చదువు తెలివితేటలు మీనాన్న దగ్గరిదే..."

"ఎందుకునాన్నా నువ్వు అట్లా అంటావు. నేను సుఖంగా వుండటం నీకు యిష్టంలేదా...మా అమ్మ కనకవుంటే..." వసంత దుఃఖం అపుకోలేక పోయింది.

కూతుర్ని వళ్ళోకి తీసుకున్నాడు తండ్రి. ఇంకా వెక్కి వెక్కి యేడవటం మొదలు పెట్టింది వసంత. ఆయనేమో ఓదారుస్తున్నాడు.

'నాన్నా నా పెళ్ళి విషయం నాకువదిలెయ్యి. నేను అంతకంటె కోరేదేమీ లేదు...అంతే...' వసంత కళ్ళు తుడుచుకుంటూ యెంతో అక్కసుగా అంది.

ఆయన మారుమాటాడలేకపోయాడు. స్తబ్దుడై అట్లాగే చూస్తూవుండిపోయాడు. వసంత చ్రరుగలేచి వెళ్ళిపోయింది. ఎంతో నిరాశగా ఆయన మెల్లిగాలేచి పెద్ద నిట్టూర్పు విడిచి మంచంమీద వ్రాలాడు. ఆ ముసలాయనకు హృదయం బ్రద్దలయినట్టనిపించింది. తాను పెట్టుకున్న ఆశలన్నీ బూడిదపాలయిపోయినాయే అని యెంతో మనోబాధ పడుతున్నాడు. ఆ వయస్సులో ఆయనకు మనశ్శాంతంతా తన సంతానం యొక్క సుఖమే. అదికాస్త ఆయనకు లేకపోయింది. పదేపదే అదే ఆలోచిస్తు పడుకున్నాడు.

## III

మసగమసగ్గా చీకటి అల్లుకు పోతోంది. ఎవరో వాకిట్లో యిద్దరు ముగ్గురు "యింత సంధాకవళం పెట్టమ్మా" అంటూ అరుస్తున్నారు. సందుచివర రెండు కుక్కలు వంతులు వేసుకుని అరుస్తున్నాయి. ఎదురుగా చెట్లమీద కొంగలు పెద్దపెద్ద ధ్వనిచేసుకుంటూ గుమికూడుతున్నాయి. గేదల్ని తెచ్చి వాకిట్లోకి, పాలచెంబులు బోర్లించి చూపిస్తున్నారు. గేదెదూడతో అక్కడ యిద్దరు ముగ్గురు పిల్లలు ఆడుకుంటున్నారు. వీధి లైట్లు చటుక్కున వెలిగినాయి. ఎంతో నీరసంగా, చిరాకుగాను తమ తమ యిళ్ళకి వెళ్ళిపోతున్నారు. పగలల్లా ఆఫీసుల్లో పని చేసి, అటు యిటు తిరిగి, వాకిట గుమ్మంలో అదుగో మా నాన్న, అదుగో మా నాన్న అంటూ ఆరోడ్డు వెంబడి పోయే మనుష్యుల్ని చూపిస్తున్నారు. మధు మెల్లిగా అప్పుడే యింటికి చేరుకుంటున్నాడు, వసంతకూడా యింటి ముఖంపట్టింది. మధు యింట్లోకి పోవటం వరకు చూసి. వసంత నిస్పృహగా యింట్లోకి వచ్చేసింది. ఆ రాత్రంతా వసంత మధన పడుతూనే వుంది. తన భవిష్యత్తు యింతటితో సమాప్తి అయిపోతుందా అనేభయం కూడా కలుగుతోంది తన జీవితంలో తాను కోరుకున్నది కోరుకుంటున్నది

లభ్యం అవటం సాధ్యమా అనే తర్కంలో ఆమెకు అనేక విధాలుగా సందేహాలు బయలుదేరటం మొదలు పెట్టినాయి. ఆ సందేహాలన్నింటిని నివృత్తి చెయ్యటానికి ఆమెకు యెవ్వరూ తోడు అవటంలేదనే దిగులు కూడా ఆమెలో ప్రవేశించింది.

భళ్లున తెల్లారేలోగా వసంతలో యెన్నో మార్పులు కలిగినాయి. ఆ మార్పులు వసంతను యింకా ఉద్రేక పరుస్తున్నాయి. ఇంకా యెగతాళి చేస్తున్నాయి. ఇంకా తన అసమర్థతను బాహాటంగా చాటుతున్నాయి. వసంతకు యింకా వుద్రేకం వచ్చేస్తోంది.

ఆదివారంనాడు సావకాశంగా మధు యింట్లో కూర్చుని సుజాత. పావని వున్నప్పుడు ఆ యిల్లు యెట్లావుండేదో వూహించుకుంటున్నాడు, పావని వట్టి పిచ్చిపిల్ల. నన్ను వదిలిపెట్టి యీ నాలుగు రోజులైనా యెట్లా వుండ కలుగుతోందో. ఆ వూళ్లో నా మాట యేమన్నా అనుకుంటోందా, ఏవేవో పావనిని గురించిన ఆలోచనలు బయలుదేరినాయి. సుజాతంటే యెంతో ప్రేమ. సుజాత యింట్లో లేకపోతే యిల్లు యెంతో బోసిపోయినట్లుంది. తాను గదిలోకి వెళ్ళినప్పుడు సుజాత వంటింట్లో వుందని, తాను వంటింట్లోకి వెళ్ళి, నప్పుడు గదిలో వుందని అనుకుంటూ తృప్తి పడుతూ వుంటాడు. తన భార్య గ్రాడుయేటు కావాలని మధుకు యెంతో మనసు. పట్టుదలగా చదివితే తప్పక పరీక్షలు ప్యాసవుతుందని మధుకు గట్టి నమ్మకం. మళ్లీ వాళ్లు యెప్పుడు వస్తారా అని యెదురు చూస్తున్నట్లు కూర్చున్నాడు.

ఇంతలో వసంత తలుపు త్రోసుకుని లోపలికి వచ్చేసింది.

"ఏమండీ...వారు యెప్పుడు వస్తారో యేమన్నా వుత్తరం వచ్చిందా అండీ..." యెంతో నాజూకుగా అడిగింది వసంత.

"ఫలానప్పుడు వస్తామనవుతే వ్రాయలేదు. రెండు మూడు రోజుల్లో బహుశా రావచ్చు..." మధు యెంతో సిగ్గుగా చెప్పిన సమాధానం.

"చదువు బాగా జరిగిందా..." వసంత యింకా ముందుకు వచ్చి అడిగింది.

"ఆ..." మధు తల వూపాడు.

"అక్కడ చదువు కుంటున్నారా..."

"మధు మాట్లాడలేదు..."

"వారు లేకపోతే నాకేమీ తోచటంలేదండి..."

మధు ఓ సారి వసంత వైపుకు చూశాడు.

'ఇంగ్లీషు పుస్తకం తీసుకు వెళ్లారా యిక్కడే వుందా...'

"ఇక్కడ లేదండి..." కొంచెం విసుగ్గా అన్నాడు మధు.

వసంతకు సమయస్ఫూర్తిగా అడిగే ప్రశ్న కనిపించలేదు.

"ఇవ్వాళ ఆదివారమేను. మా యింటికి భోజనానికి రండి..."

"అబ్బే!... నేను...యివ్వాళ..." నీళ్లునములుతున్నాడు మధు.

"మా నాన్నకూడా యింట్లోనే వుంటాడులెండి ఫరవాలేదు రండి."

"ఆ...దానికికాదు...నాకు వేరే పనుంది..."

"పని అయిపోయిన తర్వాతే రండి, తొందరేముంది..."

"అందుకుకాదు...ఫలాన టైమని చెప్పటానికి వీల్లేదు...అదీగాక బహుశా యివ్వాళ ఆఫీసుకు వెళ్లాలి మళ్లీ యెప్పుడు వస్తానో మరి..."

"అన్నింటికి అన్నీ చెపుతే యెలాగండి...ఎరెగున్నవారు కదా అని పిలుస్తేను అంత నిర్మొహమాటంగా చెప్పేస్తారేమిటి..."

"మీరేమీ అనుకోకండి. ఈసారి యెప్పుడైనా వస్తానులెండి.

"పిలిచినప్పుడు రాకండా ఎప్పుడో మాయింటికి భోజనానికి వస్తారంటారేమిటి. ఇది బాగానేవుందే..." వసంత కొంచెంగా నవ్వింది.

మాటల్ని తప్పించుకోవటానికి మధుకూడా కొంచెంగా నవ్వాడు. వసంత యింకొంచెం నవ్వింది. పళ్లు తెలీకండా మధు నవ్వాడు. వసంత, పెద్ద పెట్టున నవ్వటం మొదలుపెట్టింది. మధుకు యెంతో భయంవేసింది. వసంత నవ్వు ఆపటంలేదు. మధుకు యింకా భయంవేస్తోంది.

"ఏమండీ నేను మీయింటికి వస్తున్నాను...మీరు పదండి నామాట వినండి..." అంటూ వసంత యెదుట నిలబడి ప్రాధేయపడినట్లు అడిగాడు.

"వసంత హఠాత్తుగా నవ్వు ఆపేసి మా యింటికి భోజనానికి వస్తున్నా రన్నమాట అంటూ చివాలున లేచింది. మధుకు హృదయంలో దడ కొంచెం తగ్గింది. వసంత మనస్సు కొంత శాంతించింది. తప్పనిసరిగా మధు, వసంత యింటికి భోజనానికి వెళ్లాడు. ఆ యింట్లోవున్న కాసేపు మధుకు ముళ్లమీద వున్నట్లుగావుంది. పట్టు బిగువున ఆ రెండు మెతుకులు నోట్లోవేసుకుని బైట పడేటప్పటికి బ్రహ్మప్రళయం అయింది. వసంతకు ఆ కాసేపుకూడా మధుతో మాట్లాడటానికి అట్టే సావకాశం చిక్కలేదు తండ్రిదగ్గరే వుండటంవలన. ఆ రోజు ఒకటి రెండుసార్లు వసంత, మధుయింటికి వెళ్లిందేగాని, మధుతోపాటు యింకా యెవరో వుండటంవలన వెంటనే వెనక్కు తిరిగి రావలసి వచ్చింది ఓ సారి వెళ్లితే తలుపు తాళం పెట్టివుంది. సాయంత్రంవేళ మధు యింటికి యెప్పుడువస్తాడా అని మాటి మాటికి ఆ యింటివైపుకు వెళ్లిచూడటం మొదలు పెట్టింది వసంత. మధు రాత్రి చాలా ప్రొద్దుపొయ్యేదాక యింటికి రానేరాలేదు. వసంతకూడా విసుగుపుట్టి మెదలకండావెళ్లి పడుకుని నిద్రపోయింది.

ప్రొద్దున్నే లేచి చలికి కుంపటిముందు కూర్చుని కాఫీకి పాలు కుంపటి మీద పెట్టింది వసంత. ఆ ముసలాయనకూడ ప్రక్కనేవున్న పీటమీదకూర్చుని గజగజవణుకుతున్నాడు. ఒకకప్పు కాఫీ తండ్రికి అందిచ్చింది. తాను కాఫీ చల్లార్చుకుంటూ ఒక్కొక్క గుటకే వేస్తోంది. ఓసారిగాబోలు, కాఫీ కప్పు రవికి అందిచ్చింది. ఆవిషయం వెంటనే గుర్తుకు వచ్చింది. రవి జ్ఞాపకం రావ టంతోనే యింకా యెన్నో విషయాలు గుర్తుకు వస్తున్నాయి వసంతకు.

"నాన్నా...నీకూ నామీద కోపం వచ్చినట్టుందే..."

"నీమీద నాకు కోపంయేమిటె. చిన్నపిల్లలు తెలీక యేవేవో అంటూ వుంటారు. అవన్నీ నేను పట్టించుకుంటున్నాననుకుంటున్నావా"

"ఏదో అంటూవుంటావు. నీధోరణి నాకసలు అర్థంకాదు"

"అర్థంకానంత నేనేం చెప్పాను...నువ్వు ఒక యింటిదానివి కావాలని నువ్వు సుఖపడాలని అంతకంటె నాకు కోరిక యేముంది చెప్పు..." పొర్లుకొస్తున్న ఉద్వేగంలో అన్నాడు.

"నాన్నా..." వణుక్కుంటూ కొంచెం బిగ్గరగానే అంది వసంత.

వసంత అమాయకపు అజ్ఞానాన్ని చూసి ఆయనలోలోపల యెంతో దుఃఖించాడు. తన తండ్రి నిస్వార్థమైన ప్రేమను చూసి వసంత హృదయంలోంచి వణుకు పుట్టుకు వచ్చింది. ఇద్దరూకూడా ఒకళ్ల మొహం ఒకళ్లుచూస్తూ కూర్చున్నారు.

తన కూతురు అభిప్రాయం మార్చుకుంటుందేమోననే ఆశ ఆయనకు కలిగింది. తన యిష్టప్రకారం నడవటానికి తన తండ్రి వప్పుకుంటాడనే అభిప్రాయం వసంతకు కలిగింది. తనకు అవగాహంకాని విషయాన్ని ఆకళింపు చేసుకోవటానికి ప్రయత్నంచేస్తున్నట్లు ఆలోచిస్తోంది వసంత. తనకు యెదురుగా వస్తున్నవాటిని కాలదన్ని, తనకు కనిపించనివాటికోసం నిరీక్షిస్తోంది వసంత. తనకు అర్థం కాని మనోవ్యధ పడుతూనే, తాను బాధపడటంలేదని లోకానికి చాటుదామని తాపత్రయ పడుతోంది వసంత. తన జీవితంలో తాను కోరుకుంటున్నది యిదమిద్ధంగా తేల్చుకోలేకపోతోంది. ఉన్న అవకాశాన్ని తన మనోరథంవైపుకు త్రిప్పుకోలేక లేనివాటిని సృష్టించటానికి ఆదుర్దాపడుతోంది. తన చుట్టూ వున్న వాతావరణానికి, తన వ్యక్తిత్వానికి చాలా అంతరం వుందని వసంత అభిప్రాయం. కాని తన వ్యక్తిత్వానికి తగ్గట్టుగా కొత్తవాతావరణాన్ని నిర్మించుకోలేకపోతోంది. మధంటే ప్రేమ. రవంటే ద్వేషం. పావనంటే అసూయ. తన తండ్రింటే అహంకారం తానంటే అసహ్యం. వీటికి అతిరిక్తంగా ఆమె నడుచుకోవాలనే ప్రయత్నం. సంఘం అంటే తన ప్రతిబింబం. అందుకనే సంఘం అంటే అసహ్యం. సంఘానికి వసంతంటే యింకో అభిప్రాయంలేదు. తనకు కనబడని సంకెళ్లలో నలిబిలిఅయిపోతోంది. తాను వూహించుకుంటున్న ఖైదులోంచి, స్వేచ్ఛగా బైట ప్రపంచంలోకి వెళ్లిపోదామనుకుంటోంది. ఖైదు గదికి తలుపులులేవు, బైట కాపలావాడు లేడు. ఎత్తయిన గోడలు లేవు. తనను యెవరూ చూడరు. కాని కూర్చున్న చోటునుంచి

కదలలేక పోతోంది. తనకు స్వేచ్ఛ కావాలని గట్టిగా దద్దరిల్లేటట్లు అరుస్తుంది. బైట హాయిగా నడుస్తూపోయే వాళ్లందర్నీ చూసి అసూయపడితే యేంలాభం! ఒక్కొక్కప్పుడు, వాళ్ళుకూడా తన మాదిరి యెందుకు వుండరాదు అంటూ ఆలోచిస్తుంది. తాను కూడా వాళ్లు పొందుతున్న సుఖాల్ని పొందాలనే ఆకాంక్ష ఆమెలో చాలా ప్రబలంగా వుంది. కాని ఆమెకు ఆ విషయాన్ని బాహాటంగా వ్యక్తంచేసే మనోధైర్యం లేదు. మానసిక దౌర్బల్యంచేత తాను మనస్సు చిక్కబట్టుకుని ఫలానా ధ్యేయానికి పోవాలనే దృఢసంకల్పం ఆమెకు చేత కానిది. ఆ మానసిక సంక్షోభానికి యితరులు యెవ్వరూ కూడా బాధ్యులు కారు. కాని ఇతరుల నీచత్వాన్ని యితరుల భావదారిద్ర్యాన్ని పరిహసించటానికి ఉద్యుక్తురాలవుతుంది. వసంతకు అహంకారానికి తగ్గ ధైర్యంలేదు. తాను కట్టుకున్న కృత్రిమపు ఎత్తయిన నాలుగుగోడల మధ్య కుమిలిపోతోంది. ఆ గోడ దాటటం, ఆమె శక్తికి మించినపని.

మర్నాడు మధు యింటిముందు ఓ బండీ వచ్చి ఆగింది. ఆ బండీ చప్పుడువిని వసంత గబగబ వాకిట్లోకి వెళ్ళింది. బండీలోంచి మొదట పావని దిగింది. తర్వాత సుజాత మరచెంబు మధుకు అందిచ్చి మెల్లిగా దిగింది. వసంత కొంచెం తలుపుచాటుగా దాక్కుంది.

సుజాత అనుకోకుండా వసంత ఇంటివైపుకు దృష్టిని మరల్చింది. సుజాతకు యేవేమిటో జ్ఞాపకం వస్తున్నాయి. ఎన్నో విషయాలు వూహించుకుని, వాటిని గురించి ఎవరిని అడగటానికి యిష్టపడక, లోపలికి వెళ్ళిపోయింది. మధుకు, సుజాత ఏ విషయాన్ని గురించైనా ఆలోచిస్తున్నదా అనే విషయమే తట్టలేదు. సుజాత యిల్లంతా నాలుగు మూలల కలయచూసింది. తన వూహకు తగ్గట్టు, యింట్లో విషయాలేమీ కనిపించలేదు. పడుగు విశేషాలు చెప్పుకుంటూ కొంచెం కాలక్షేపం చేశారు. పావని వూపిరి ఆడకండా చెప్పుకు పోతోంది. మధు అన్నింటికి "ఊ" కొట్టుతూ వింటున్నాడు.

"ఆడది యింట్లో నాలుగు రోజులు లేకపోయేటప్పటికి యిల్లు యేమారసన వుందో చూడండి..." నాలిక కరుచుకుంది సుజాత.

"ఎక్కడ నాకు తీరుబడి చెప్పు. తెల్లారిలేస్తే, వల్లమాలిన పనులు. వాటితోనే సతమతమయిపోతానా ఈ ఇల్లే చక్కదిద్దుకుంటానా. అవును గాని సుజాతా విన్నావా...మనకు ఉద్యోగంలో ప్రమోషన్ అయ్యేటట్లుంది. కొద్ది రోజుల్లోనే తెలుస్తుంది..." ఎంతో సంతోషంగా మధు అన్నాడు.

"ఈ రిబ్బను యిక్కడే పడేసి పోయిందిగామాలు ఆ వసంత. ఆ అమ్మాయికి వక్కటీ తెలీదు చదువుకుందన్నమాటేగాని...ఈ సారి యిక్కడకు వచ్చినప్పుడు జ్ఞాపకం పెట్టుకుని యివ్వాలి..." అంటూ చిలక కొయ్యకు తగిలించింది.

ఇల్లంతా సద్దుకుంటోంది, కాని సుజాత మెదడు తొలుస్తూనేవుంది ఆమె ఆలోచనలు ఏ రకంగా పోతున్నాయొ, ఆమెకే అయోమయంగావుంద

"ఏమండీ..." అంటూ సావిట్లోకి వచ్చింది సుజాత.

"ఆహా...ఏంలేదులెండి..." అంటూ మళ్లీ లోపలికి పోయింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు..." అన్నాడు మధు, పావనినికూడా వంటింటిలోకి తీసుకువస్తూ.

"ఏమోనండి...మీరు లేకుండా నేను మావాళ్ళింటికి వెళ్లటం అంటే ఏమిటోగా అనిపించిందండి..." నిదానంగా పనులు చేస్తోంది.

మధుకూడా ఏవేవో ఆలోచిస్తూ అట్లాగే నిలబడి పోయాడు. పావని తండ్రి వంక చూస్తూ నుంచుంది.

ఒకటి రెండు రోజులదాక, సుజాత, ముక్తసరిగానే వసంతతో మాట్లాడుతూ, తన పనులేమిటో తాను చూసుకుంటోంది. గదిలో వసంత, సుజాత, కూర్చుని వున్నారు. మధు గమనించకుండానే, సుజాత వక్కత్తే వుందనే అభిప్రాయంతో. గబగబ లోపలికి వచ్చేసి, సుజాత...చూశావా..." అంటూ సుజాత వళ్లో తాను ఆఫీసులో తీయించుకున్న ఫొటో పెట్టేశాడు.

సుజాతకు యెంతో సిగ్గేసినట్లనిపించింది. వసంతలో అగ్ని జ్వాలలు ప్రజ్వరిల్లినాయి. మధు యింకా యేవేవో మాట్లాడబోతుంటే, సుజాత కను

సంజ్ఞచేసింది. వసంత పక్కన వికటంగా నవ్వింది. మధుకు మండిపోయింది. సుజాత నొచ్చుకుంది. కొద్ది క్షణాల్లోనే వసంత వాళ్లింటికి వెళ్లిపోయింది. వసంతను గురించి యేమైనా అంటాడేమోనని సుజాతకు బెరుకుగావుంది. వసంత విషయమై ప్రస్తావన తేస్తుందేమోనని మధుకు సందిగ్ధంగావుంది. ఇద్దరూ కొద్దిక్షణాలు మౌనం దాల్చినతర్వాత, మధు కల్పించుకుని అన్నాడు. "అన్నట్టు, నీపరీక్షలు దగ్గరకి వస్తున్నాయిగామరి యేమన్నా సాధించేటట్లున్నావా?"

"ఇహనుంచి శ్రద్ధగా చదవాలండీ...అవడుక్కు వెళ్ళటంతో మన కార్యక్రమాలే తారుమారయినాయి..." అంటూ సుజాత మళ్లీ తాను తెల్లారి లేచినప్పటినుంచి, రాత్రి నిద్దరపోయేలోగా ఎప్పుడెప్పుడు యేయే పనులు చెయ్యాలో వివరంగా రాసుకుంది. ఆ టైమ్‌టేబుల్ మధుకు సమ్మతిగానే వుంది.

మర్నాటినుంచి క్రొత్త కార్యక్రమాల పట్టిక అమలులోకి వచ్చింది. సుజాత శ్రద్ధగాను, పట్టుగాను చదువుతోంది. అప్పుడప్పుడు వసంత దగ్గరకు వెళ్లి, కొన్ని విషయాల్ని చెప్పించుకుంటోంది.

"ఏం సుజాతా...ఈ పరీక్ష ప్యాసవంగానే బి. ఏ. కూడా చదువుతావా..." వసంత వుద్వేగం ఆపుకోలేక అడుగుతోంది.

"ముందర యీమెట్టు దాటనీండి. తర్వాత చూసుకుందాం..." అంటూ సుజాత, వసంతవైపుకు అదోరకంగా చూసింది.

వసంతకు యేమీ అడగడానికి పాలుబోవటంలేదు. సుజాత అడిగిన పాఠాలు చెప్పటంమాత్రం తప్పనిసరి అయిపోయింది. పరీక్షల రోజులు దగ్గరలోకి వచ్చేస్తున్నాయి. సుజాత చాలా ధైర్యంగావుంది. పరీక్ష ప్యాసవుతాననే గట్టి నమ్మకం యేర్పడింది. వసంతకు చాలా భయంగావుంది సుజాత ఇంటర్ పరీక్ష ప్యాసవుతుందేమోఅనే దిగులుతో వుంది.

సుజాత పరీక్షలన్నీ బాగారాసేసి వచ్చింది. ఎంతోబాగా వ్రాశానని వసంతతో చెప్పింది.

"మీకు తెలీదండీ యీ పరీక్షల సంగతి. మనం బాగానే వ్రాశామను కుంటాంగాని, రిజల్ట్సు వచ్చేదాక మనం యేసంగతీ చెప్పలేం. మా క్లాస్ మేట్ వకడు యిట్లాగే బాగా వ్రాశాను ఫస్టక్లాసు వస్తుంది అని చెప్పాడు. తీరా పేపర్లో చూస్తే, మూడ్డోపార్టు మిగిలిపోయింది..." వసంత తన మనస్సులో వున్నది దాచుకోలేకపోయింది.

"ఏమోలెండి......మొత్తంమీద నేనవుతే తృప్తిగానే రాశాను. తర్వాత సంగతి చూసుకుందాంలెండి" అంటూ విరక్తిగా సుజాత యింటికి వెళ్ళిపోయింది.

"ఏమోనండి...ఆమెగారి ధోరణి నాకేమీ బాగాలేదు. పోనీ యిష్టంలేదని చెపితే యెవరు బలవంతంపెట్టారు. అంత యిదా మరి తోటిస్త్రీని చూస్తేను..." సుజాతకు యెంతో మనస్సుకు కష్టమై అన్నది మధుతో.

"...ఏం జరిగిందేమిటి"...ఎంతో తేలికగా అన్నాడు మధు.

"ఏంలేదులెండి. నేను పరీక్షలన్నీ బాగా రాశానని చెపుతుంటే, పాసయ్యేదాక నమ్మటానికి వీల్లేదంటుంది. తెలిసి అన్నమాటా తెలియక అన్న మాట..." సుజాతకు యెంతో అసహ్యం వేసింది.

మధువిని, నవ్వి వూరుకున్నాడు. సుజాత కాసేపట్లోనే ఆ మాట మరిచే పోయి తన పనుల్లోకి పోయింది.

గడియారం అలారం మోగకమునుపే మధు ప్రక్కమీదనుంచి లేచాడు. పావని ప్రశాంతంగా నిద్రపోతోంది. సుజాత ప్రక్కమీద మసులుతోంది. ఏవో కాగితాలు తిరగేస్తున్నాడు. నిశ్చలంగా, తనకు యెదురుగా వున్న ఫోటోవంక చూస్తూ ఏవో లోపల లోపల చదువుకుంటున్నాడు. అప్పుడప్పుడు మాత్రం సుజాత వైపుకు చూస్తున్నాడు నిద్రనుంచి లేస్తోందేమో అని. తర్వాత వెంటనే స్నానం చేసి, యింట్లో మూలగా పీట వేసుకుని అక్కడ కళ్లు మూసుకుని ధ్యానంలో నిమగ్నుడయిపోయాడు మధు. కాకులు కావు కావు మంటూ ధ్వని చెయ్యటం మొదలు పెట్టినాయి. బుడ బుక్కల వాడు పాడు కుంటూ వస్తున్నాడు. కుక్కలు తెగ మొరుగుతున్నాయి వాకిళ్లలో నీళ్లు

చల్లుతున్న చప్పుడు వినిపిస్తోంది. మేలుకొలుపు పాటలు పాడుకుంటూ వీధుల వెంబడి కొంతమంది వెళ్లుతున్నారు. పాలకోసం వదిలిపెట్టిన గేదెలు విచ్చల విడిగా దొడ్లోపడి మేస్తున్నాయి.

"అమ్మా...అమ్మా..." అంటూ మెల్లిగా పనిచేసేది తలుపుకొట్టింది.

నిద్రకలతలోనే లేచివచ్చి, సుజాత తలుపు తీసింది. కళ్లు తుడుచుకుంటూ, బాగానే తెల్లారిందే. బండ నిద్ర...అనుకుంటూ గబగబ లోపలికి వచ్చేస్తోంది. మధు అవన్నీ కట్టిబెట్టి, మెల్లిగా దొడ్లోంచి వస్తున్నట్లు, దొడ్డితలుపు చప్పుడు చేశాడు.

"మీరు యెప్పుడనగా లేచారేమిటి..." ఆశ్చర్యంగా మధు కళ్ళలోకి చూస్తూ సుజాత అడిగింది.

"ఇప్పుడే...ఇట్టే దొడ్లోకి వెళ్ళి వస్తున్నా..." ప్రొద్దున్నే అబద్ధం ఆడాలసి వచ్చిందే అని యెంతో నొచ్చుకున్నాడు మధు.

సుజాతా యింకా యేమీ అడగలేదు మధు హడావిడిగా అలమారలో పుస్తకాల దగ్గరకు వెళ్లాడు.

పడక కుర్చీలో కూర్చుని ఆఫీసు ఫైల్సు చూసుకుంటున్నాడు. తనకు వచ్చినవి, యిచ్చినవి, సర్టిఫికెట్లన్నింటినీ ఓసారి చూసుకుంటున్నాడు. మురిసి పోతున్నాడు. తాను యిన్నాళ్లనుంచి చేస్తున్న పనికి యీ నాటికి అధికారులు గుర్తించి ప్రమోషన్ యిస్తున్నారు, సుజాతతో ఫలానరోజున అని చెప్పటం యిష్టంలేదు. సుజాతకు ఆశ్చర్యం కలిగించేటట్లు చేదామనుకుంటున్నాడు. ఆ నాడల్లా యింట్లో యేదో తమాషగా వున్నాడు. సుజాత గమనించిందన్న మాటేగాని, ఆమె దృష్టి, అటుపోలేదు.

ఆనాడు సాయంత్రం, తీరుబడిగా కూర్చుని పావనికి జడవేస్తోంది సుజాత. పంచలో యిద్దరు ముగ్గురు ఆడపిల్లలు పావని యెప్పుడు వస్తుందా అని యెదురు చూస్తూ కూర్చున్నారు.

"అమ్మా తొందరగా జడవెయ్యవే..." అంటూ పావని తల్లిని తొందర పెడుతోంది.

"ఏముందీ వెళ్లి ఆ మట్టిలో ఆడుకోటానికేనా...శుభ్రంగా నీళ్లు పోసుకుని, ఇంట్లో ఆడుకోరాదు. ఆ వీధుల వెంబడి వెళ్ళితేగాని ఆడుకున్నట్లు కాదా యేమిటి?" సుజాత జెడ లాగి లాగి వేస్తోంది.

"అమ్మా నెప్పే మెల్లిగా వెయ్యవే" అంటూ గుంజుకుంటోంది పావని.

ఎట్లాగైతే జడవెయ్యటం పూర్తి అయింది. ఒక్క గంతులో లేచి నిలబడింది.

"చెప్పేదెవరికే...మళ్లీ వెళ్లుతున్నావన్న మాట..." సుజాత నూనె సీసా దువ్వెన్న చేతబట్టుకుంది.

"ఇప్పుడే వస్తానే మట్టిలో ఆడుకోనుగా..." పావని ప్రాధేయపడుతూ సుజాతవంక చూసింది.

"నీ యిష్టమమ్మా..." సుజాత వెనక్కు అడుగువేసిందో లేదో, వాకిట్లో బండీ ఆగినట్లు చప్పుడు అయింది. వెంటనే ఆగిపోయింది సుజాత. పావని గభాలున వురుక్కుంటూ వాకిట్లోకి వెళ్లింది మధు బండీలోంచి దిగాడు.

"అమ్మా అమ్మా...నాన్న గుర్రపు బండీలో వచ్చాడే..." పావని యెంతో సంతోషంగా లోపలికి వచ్చింది.

"నాన్నగారు బండీలో వచ్చారా" ఆశ్చర్యంగాను, ఆదుర్దాగానూ గబగబ వీధిగుమ్మం దగ్గరకు వెళ్లింది.

మధు సూటుకేసు పట్టుకుని లోపలికి వస్తున్నాడు. వెనకాలే బండీ వాడు రెండుచేతులా రెండు క్రొత్తపెట్టెల్ని పట్టుకు వస్తున్నాడు. పావని సంతోషం పట్టలేకపోతోంది.

"ఏమిటండీ యివన్నీ..." సుజాత పొంగిపోతున్న సంతోషాన్ని ఆపుకుంటూ అన్నది.

"నాకు వుద్యోగంలో ప్రమోషన్ వస్తుందనిచెప్పలా. ఈనాటినుంచి మనం మనిష్టం వచ్చినట్లు వుండచ్చు. అదివరకు నాకు రావలసినడబ్బుకూడా

యిచ్చేశారు. అందుకనే యివన్నీ తీసుకువచ్చాను. ఇదిగో అమ్మాయికి పట్టు పరికిణీ, ఇదిగో నీకు చీర, ఈ బట్టలునావి. ఈ పెట్టె నీకోసం తెచ్చాను. బి.ఏ. కూడా చదువుతావేమో. నీ పుస్తకాలు పెట్టుకోవటానికి పెట్టె అక్కర్లేదు...ఇదిగో యిది అమ్మాయికి..." ఒక్కొక్కటి తీసి చూపిస్తున్నాడు మధు.

అమాంతంగా వున్నట్లుగా సుజాత, మధు కాళ్లమీద పడింది. ఆనంద భాష్పాలు తుడుచుకుంటుంటే, మధు మెల్లిగా రెండుచేతులు పట్టుకుని, లేవదీస్తూ, "నేను కష్టపడేది మీకోసముకాదు..." అన్నాడు.

పావని వుక్కిరి బిక్కిరయి అట్లాగే నిలబడిపోయింది. 'ఏమిటే అట్లా నిలబడిపోయినావు. నాన్నగార్కి నమస్కారంచెయ్యి...' వణుక్కుంటూ సుజాత అన్నది.

"నమస్కారం అని రెండు చేతులు జోడించింది..." వున్నది వున్నట్లుగా పావని.

"పిచ్చిపిల్ల..." అని నవ్వుకుంటూ పావనిని వళ్లోకి తీసుకున్నాడు మధు.

సుజాతకూడా ఎంతో జాలిగా నవ్వింది.

ఎంతో సంతోషంగా సుజాత పిండి వంటలు చేసేస్తోంది. మధు యిల్లంతా సర్దేస్తున్నాడు. పావని తండ్రితో సమానంగా అటు యిటు యింట్లో తిరుగుతోంది. పావనికోసం వాకిట్లో కాచుకునివున్నపిల్లలు లోపలికి తొంగి తొంగి చూస్తున్నారు. మధు వాళ్ళను చూసి లోపలికి పిలిచి మిఠాయి పంచి పెట్టాడు. ముగ్గురు ఒక్కసారే భోజనానికి కూర్చున్నారు. ముచ్చటగా మాట్లాడుకుంటూ, భోజనాలు ముగించారు. పావని అన్నింటిని ఒక్కసారి చూసి, వెళ్లి మంచంమీద పడుకుంది. పావని నిద్ర ఆపుకోలేదు. సుజాత, మధు దొడ్డిగుమ్మంలో కుర్చీలు వేసుకుని రికామిగా కూర్చుని మాట్లాడుకుంటున్నారు. వాళ్లిద్దరి ఆలోచనలు, వూహలు అనేక రకాలుగా పరుగెత్తుకుపోతున్నాయి. చల్లటి వెన్నెల కిరణాలు కిటికీలోగుండా వీళ్లిద్దరిమీదపడి

మనస్సుల్ని కలవర పరుస్తున్నాయి. కొంచెం చలిగాకూడా వుంది. మెల్లిగా తలుపులు వేసుకుని లోపలికి వెళ్ళిపోయారు.

ఆ రాత్రి, వసంతకు నిద్రపట్టటంలేదు. మర్నాడే ఇంటర్ రిజల్ట్సు వస్తాయి. సుజాత ప్యాసవుతుందేమో అని లోపల భయం. తన భవిష్యత్తును గురించి, తన సందేహాల్ని గురించి వికృతంగా ఆలోచించుకుంటోంది.

భళ్ళున తెల్లవారింది. పావని పెందరాళే లేచింది. అటు యిటు చూసింది. అమ్మా, అమ్మా అంటూ గది తలుపు గట్టిగా కొట్టింది. సుజాత ఉలిక్కిపడిలేచి వచ్చి తలుపు తీసింది.

"అమ్మా నువ్వు నా దగ్గర పడుకోలేదేమిటే..." రాగాలు ప్రారంభించింది పావని.

'తొందరగా మొహం కడుక్కొని రా...నాన్నగారు తెచ్చిన పట్టు పరికిణా కట్టుకుందిగాని...' సుజాత తొందర చేసింది.

పావని యెంతో సంతోషంగా గంతులు వేసుకుంటూ దొడ్లోకి వెళ్ళిపోయింది.

"ఏమండీ...కాఫీకూడా చల్లారిపోతోంది..." సుజాత మధు మంచం దగ్గరకు వచ్చి అన్నది.

"నాన్నా...లే...నాన్న...నేను కొత్తబట్టలు కట్టుకున్నా...లే..." పావని దీర్ఘాలు తీస్తోంది.

కాసేపటికి మధుకు మెలుకువ వచ్చింది. ఆదరాబాదరాగా మొహం కడగేసుకుని, కాఫీ సేవించాడు. ఎదురుగుండా పావని నుంచునివుంది. కుర్చీలో పడుకుని మధు, పావని వంక చూస్తున్నాడు. కాఫీ గ్లాసు పట్టుకుని సుజాత లోపల్నుంచి వస్తోంది.

"నీ నెంబరు చెప్పవోయి ముందర."

"కంగ్రాట్యులేషన్సు..."

"ఈసారీ బండి ఎక్కావ్.

"నువ్వు యింకో పేపరు కొనుక్కో నాది నాకిచ్చేసెయ్యి..."

వాకిట్లో రణగుణ ధ్వని వినిపిస్తోంది సుజాతకు దబ్బున జ్ఞాపకం వచ్చింది.

"ఏమండీ రిజల్ట్సు వచ్చినట్టున్నాయండి..." మధుతో అతి నిబ్బరంగా అన్నది.

చటుక్కున కుర్చీలోంచి, ఒక్క గంతులో వాకిట్లోకి వెళ్లాడు.

"ఓ అబ్బాయి, ఇంటర్ వేనా...అట్లావుతే 8970 నంబరు...ఆ... సెకండ్ క్లాసా..." మధు తత్తరపడుతూ లోపలికి వచ్చాడు.

సుజాత అమాంతంగా మధు దగ్గర వరిగింది.

"ఏమిటది నీకేమన్నాపిచ్చా...నేను చెప్పటంలా...నాకు తెలీదూ నీ సంగతి అమ్మాయి...అమ్మ పెద్ద పరీక్ష ప్యాసయిందే..." మధు పావనిని యెత్తుకొని గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.

"నాన్నా...నేను ఒకటో క్లాసు పరీక్ష ప్యాసవుతానా..."

పావని కళ్ళల్లో స్కూలు మాస్టరు మెదిలాడు.

"ఓ...లెక్కొచ్చె...నువ్వు ప్యాసుకాక పోవటమేమిటి..." పావని యిల్లంతా పరుగెత్తుకుంటూ పోతోంది.

"సుజాత...నేను మెట్రిక్ నేగదా. నువ్వేమొ ఇంటర్ పరీక్ష పాస యినావు. నీకు అవమానంగా ఉండదుగదా..." మధు యెందుకు అన్నాడో అర్థంకాలేదు.

సుజాత యెంతో నొచ్చుకుంది. ఎంతో బాధపడింది. ఆ సమయంలో తనలో జనించిన ఉద్వేగాన్ని బైట పెడదామనుకుంది. భార్యాభర్తల అన్యో న్యప్రేమ, గౌరవాలు వీటిమీద యెంతైనా వుద్రేకంగా మాట్లాడేద్దామను కుంది. ఎంతో బలవంతాన వాటన్నింటిని ఆపుకుని.

'ఏమండీ మీరూ అట్లా అంటున్నారా...' అంటూ గొంతులో శబ్దం పూర్తిగా బైటకు రానీలేదు సుజాత.

మధు కూడా చాలా చలించి పోయాడు.

"నేను వెళ్లి వసంతకు కృతజ్ఞత చెప్పుకోవాలి..." అంటూ బయలు దేరింది సుజాత.

నేనుకూడా వస్తానంటూ మధు వెంట నడిచాడు.

"అమ్మా... నేనో...అంటూ వెంటబడింది పావని.

వసంత తండ్రి అప్పుడే వాకిట్లోంచి లోపలికి వెళ్ళబోతున్నాడు. సుజాత, మధుల్ని చూసి ఒక్కసారి వెనక్కు తిరిగి, మళ్ళీ లోపలికి వెళ్లి పోయాడు. ఆ యిద్దర్ని తాను చూడలేక పోయాడు. తన కూతురుకూడా అట్లాగే తన దగ్గరకు యెప్పుడు వస్తుందా అని అహోరాత్రాలు దిగులుపడి పోతున్నాడు. ఆ దిగులులో యితరులనుచూసి సంతోషించే సహనం అంత రించి పోయింది. సుజాత మధులమీద యెంత ప్రేమ, గౌరవంవుందో, అంత ద్వేషంకూడా యీ మధ్యనే వసంత తండ్రికి కలుగుతోంది. దానికి కారణం ఫలానా అని ఆయనే తెలుసుకోలేక పోతున్నాడు.

వసంత కుర్చీలో చలనంలేకుండా కూర్చునివుంది.

"నమస్తే... నేను ఇంటర్ ప్యాసయ్యాను. మీదయవలన, నాకు యీ మాత్రం గౌరవమేనా లభించింది. మీ మేలు నేను యెన్నటికీ మరవలేదు..." సుజాత యింకా యేదో, అభిమానంతో అనేసేస్తోంది.

వసంత వక్క పెట్టున బావురుమని, సుజాతను కౌగలించుకుంది. సుజాత మనస్సుకూడా చలించిపోయింది.

"ఏమీ అనుకోకండి. ఆనందభాష్పాలు...నాకు చాలా సంతోషం మీరు పరీక్ష ప్యాసవటం...నాకు తెలుసు మీసంగతి ఇంకా మీరు బి. ఏ. కూడా పట్టుగా చదవాలి. అశ్రద్ధ చెయ్యకూడదు—" ఏవేవో అనేశేస్తోంది. ఆవేశంలో వసంత.

"మా అమ్మాయి యేంచెప్పింది...అంతా ఆమె శ్రద్ధగా చదువుకుంది' ఫలితం వచ్చింది మీ ఇద్దర్ని చూస్తుంటే నాకు యెంతో ముచ్చటగా

అనిపిస్తోంది... నాకు మీమీద యేమాత్రం ద్వేషంలేదు..." మధును గట్టిగా కౌగలించుకున్నాడు వసంత తండ్రి.

ఎంతో నిస్సత్తువుగా లేచి వసంత వాకిటి గుమ్మందాకా వచ్చింది. మధుకు, వసంతతో తన కృతజ్ఞత చెప్పుకోవటం ఒక కర్తవ్యం అనిపించింది.

"మీరు చేసిన మేలుకు, నా భార్య తరఫున నేనుకూడా మీకు కృతజ్ఞత తెలుపుకుంటున్నాను—" అన్నాడు మధు ముక్తసరిగా వసంత వైపుకు చూస్తూ.

వసంత మొహం విప్పారింది. హృదయంలోంచి వస్తున్న ఆనందాన్ని పరిమితంచేసి 'మీలాంటి భర్త కలిగివుండటం, ఎంతేనా అదృష్టం...' అన్నది ఎంతో నిబ్బరంగా.

సుజాత, మధువంక చూసింది. మధు ముందుగా నడిచాడు. పాపనికి అక్కడకు యెందుకు వచ్చిందో అర్థంకాలేదు. వెనక్కు వెనక్కు చూస్తూ తండ్రి వెంట పడింది.

వసంత మనస్సులో ఘర్షణ బయలుదేరింది. మగవాడైనా ఆ పరిస్థితుల్లో యేమీ చెయ్యలేడేమో అని అనిపించింద వసంతకు. విచారంగా, దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చున్నది వసంత.

పోస్టుమన్ అని శబ్దంవచ్చింది. కళ్లు గబగబ తుడుచుకుంటూ పమిట సద్దుకుంటూ, వాకిటతలుపుతీసింది. పోస్టుమన్ మూడుకవర్లు యిచ్చాడు. అందులో వకటి శుభలేఖ. తన పేరే ఉంది. ముందర అదుర్దాగా కవరువిప్పి చూసింది. శ్రీహరి, సుశీలల పెళ్లి శుభలేఖ. ఆ శుభలేఖలో శ్రీహరిమూర్తి నిండుగా కనిపించింది. కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగిపోయినాయి. సుశీల మీద యెంతో ఆక్రోషం వచ్చింది. సుశీలను తాను యెన్నోసార్లు కలుసుకుంది గాని, మాట మాత్రంగానైనా సుశీల ఈ విషయం యెన్నడూ చెప్పనే చెప్పలేదు. సన్నిహితంగా ఉంటున్నా కూడా వ్యక్తిగత విషయాలు వచ్చినప్పుడు మనుష్యులు యెంత కపటంగా ప్రవర్తిస్తారో, వసంతకు యిప్పుడు పూర్తిగా

అర్థమయింది. గబగబలోనికి వెళ్ళి, పెట్టెతీసి, పుస్తకాలన్నింటిని చిందరవందర చేసింది. అట్టడుగునవున్న శ్రీహరి ఫొటోతీసి చించి ముక్కలు చేసింది. శుభ లేఖకూడా చించేస్తోంది. తండ్రి, యేమిటే అమ్మాయి ఆచప్పుడు అంటూ మెల్లిగా గదిలోకి వచ్చాడు.

"ఏంలేదు నాన్న పుస్తకాలు సద్దుతున్నాను—అంటూ ఆ పుస్తకాలన్నింటిని మెల్లిగా ఒక్కచోట పోగు పెడుతోంది.

"ఆ చేతులో కవరేమిటే..." ఆయన కళ్లు అనుకోకండా అకవరు మీద పడ్డాయి.

వసంత యేవిధంగాను తప్పించుకునే స్థితిలో లేదు. ఆ కవరు విప్పి చూద్దామని అనుకుండే గాని యింతలో కోపం పట్టలేక ఈవిధంగా చేస్తోంది తప్పని సరిగా ఆకవరు తండ్రికి యివ్వాలసి వచ్చింది.

"ఎప్పుడొచ్చినాయి ఇవి....." అన్నాడు ఓ కవరు చింపుతూ, ఇంకో కవరును చేతులోపట్టుకుని.

'...విన్నావా...వాడే రాశాడు...వస్తున్నాట్ట...రేపు సాయంత్రమే ...అమ్మాయి యిక యేమీ ఆలస్యం చెయ్యకూడదు. నాతో చెప్పేసెయ్యమ్మాయి—ఆయనకూడా అక్కడే కూలబడ్డాడు.

వసంత సంధిగ్ధావస్థలో పడింది. ఎటు మాట్లాడటానికి తోచటంలేదు.

"అవుత్తరం యెవరిది..." వసంత మెల్లిగా, తండ్రిచేతులో ఉత్తరాన్ని తీసుకోబోయింది.

"ఇది సుజాతకు వచ్చింది. పొరపాటున మనయింట్లో యిచ్చిపోయాడు. నేను వాళ్లకు యిస్తానులే..." ఆయన అతి నిదానంగా జేబులో పెట్టుకోబోతున్నాడు.

"నేను యిస్తాన్లే నాన్న..."అంటూ చేతులోంచి, లాక్కుంది వసంత.

"అయితే యేమంటావే ఖచ్చితంగా చెప్పేసెయ్యవే..." తండ్రి యెంతో విసుగ్గా అన్నాడు.

"చెపుతాన్లే నాన్న..." లేని సంతోషాన్ని తెచ్చుకుంటూ అన్నది వసంత.

ఆయనకు యెంతో తృప్తినిచ్చింది ఆసమాధానం. తన కూతురి మాటలో, రవిని పెళ్లి చేసుకోటానికి సిద్ధపడుతోంది అనే ధ్వనివినిపించింది. ఆయన ఎంతో హాయిగా నవ్వుకుంటూ లోపలికి పోయాడు. వసంత, తనగదిలోకి వెళ్లిపోయింది. గబగబ ఆకవరు చించి చూసింది. సుజాతకు అభినందనలు పంపుతూ, వాళ్ళ పినతండ్రి కొడుకు వ్రాసిన ఉత్తరం. వసంతకు మరీ మండిపోయింది. తన మెదడులో అనేక రకాల ఆలోచనలు గిర్రున తిరిగిపోతున్నాయి. సుజాతమీద తనకున్న కసి తీర్చుకునేందుకు తగిన సమయము వచ్చిందనుకుంది. పాపం సుజాత నాకేంచేసింది! అన్యాయంగా ఆమెను బాధపెట్టటం యెందుకు? నాకడుపు మంట తగ్గాలంటే, నాకు శాంతి కావాలంటే, సుజాతను బాధ పెట్టితీరాలి. ఆమె నిశ్చయంగా అనుకుంది. వెంటనే తలుపుదగ్గరగా వేసి, బజారుకు వెళ్లిపోయింది. టైపుచేసిన కాగితం ఆకవర్లో పెట్టి అంటించేసి, అటూ ఇటూ చూసి ఎవరూ చూడని సమయంలో సుజాత యింటి తలుపు సందుల్లోంచి లోపలికి వేశేసింది. ఇంటికి వచ్చి సావకాశంగా ఆవుత్తరం యొక్క చెడు ఫలితాలను వూహించుకుంటూ సంతృప్తిపడుతోంది వసంత.

సుజాత మంచంమీద పడుకుని, కళ్లు మూసుకుంది. పావని యేదో ఆడుకుంటోంది. అటూ యిటూ తిరగటంలో పావనికి ఆకవరు కనిపించింది. పరుగెత్తుకుంటూ కవరు తీసుకువెళ్లింది, తల్లి దగ్గరకు. నిద్రపోతుంటే లేపటం యెందుకని మెల్లిగా వెళ్ళి, తండ్రి కోటుజేబులో పెట్టేసింది. ఇప్పుడయితే మధు యింటికి పెందరాళేవస్తున్నాడు. ఆటల పరధ్యానంలో, పావని తండ్రికి చెప్పలేదు. అవీ యివీ మాట్లాడుతూనే యిట్టే నిద్రపోయింది పావని. వసంత యీయింటి వాకిటి గుమ్మందగ్గరపొంచిచూస్తూనేవుంది. ఇంట్లో అయితే ఏమీ సంఘర్షణగా, వినబడటంలేదు. వసంతకు ఏమీ అర్థంకావటంలేదు. బహుశా ఆకవరూ చూడలేదేమో అని అనుమానం ఆమె మనస్సును పీడిస్తోంది. చేసేదేమీ కనిపించటంలేదు. కొంచెంసేపు అటాగే నిలబడి, చివరకు విసుగుపుట్టి, ఇంటికి

వెళ్లిపోయింది. ఆరాత్రంతా ఎన్నెన్నో ఆలోచనలు చేసేస్తోంది. తెల్లారితే రవి వచ్చిపడతాడనే విషయం మరింత భయంకరంగా ఉంది. ధైర్యం తెచ్చుకుంటోంది. గుండె నిబ్బరంచేసుకుంటోంది. కళ్లు మంటలు పుట్టేదాక మేలుకుని విసుగుపుట్టి నిద్రపోయింది.

మర్నాడు మామూలుగానే మధు కోటువేసుకుని ఆఫీసుకు వెళ్లిపోయాడు. ఆఫీసులో ఫైల్సు చూస్తూ ఆ రోజు వచ్చిన టపాతీసుకున్నాడు. ఇంతలో సెక్రటరీ, మధునుపిలిపించాడు, హడావిడిగా కోటులో పెన్ను తీసుకుని లోపలికి పరుగెత్తాడు మధు. అవతల గదిలోంచి వచ్చిన చప్రాసి, మధుకోటు క్రిందగా పడివున్న, కవరును తీసి టేబుల్ మీద పెట్టి వెళ్ళిపోయాడు. ఇంకో చప్రాసి వచ్చి టేబిల్ మీద ఉన్న కవర్లన్నింటిని చించేసి, కాగితాలు వరసగా, అమర్చి కవరుకాగితాన్ని టేబుల్ క్రిందబుట్టలో పడేశాడు. ఆ కాగితాలుట్టంతా తీసుకువెళ్లి, సెక్రటరీ టేబుల్ మీద పెట్టాడు. ఇంతలో మధు తిరిగి తన టేబుల్ దగ్గరకు వచ్చేశాడు.

"శంకరయ్యా...శంకరయ్యా" ఓ మూల బెల్ మోగిస్తూనే సెక్రటరీ కేకలు పెడుతున్నాడు.

శంకరయ్య వురకలు వేసుకుంటూ పరుగెత్తుకుంటూ వచ్చాడు లోపలికి.

"ఎవరు యీ వుత్తరాలు తెచ్చింది. ఇది ఆఫీసా! యిల్లా! అంతమాత్రం బుద్ధివుండక్కర్లా...కళ్లు మూసుకుని అన్నికవర్లు చించెయ్యటమేనా... సుజి ఎవరు మన ఆఫీసులో..." సెక్రటరీ గద్దించాడు.

శంకరయ్య ఒక్క క్షణం యేమీ సమాధానం యివ్వలేక పోయాడు.

"డియర్ సుజి...నేను మన వూరువదలిపెట్టి వెళ్ళినప్పటినుంచి నా మనస్సు యెట్లాగో వుంటోంది...తక్షణం నిన్ను కలుసుకోవటానికి బయలుదేరి వస్తున్నాను...ఆనాటి నీ మృదుమధుర అధరములు మరవలేను...ఇట్లు రవి..." ఇదేమన్నా ప్రేమ కలాపాలకు స్థాపించిన ఆఫీసా...నువ్వు చెప్పు

శంకరయ్యా....సుజీ యెవరంట మనఆఫీసులో..." సెక్రటరీ ఆ వుత్తరాన్నే పదేపదే చూస్తున్నాడు.

"అయ్యగారు, డిస్పాచ్ సైపమ్మ సార్. ఆమెగార్ని కలుసుకోవటానికీ రోజుకు యిద్దరు ముగ్గురు తప్పకండా వస్తూవుంటారండి. ఎప్పుడూ కూడా అమ్మని సుజీ అని పిలుస్తూ వుంటాగండి...మనకేమొ మేరీ అని పేరిచ్చింది...నాకు యిప్పుడు జ్ఞాపకం వస్తోంది..." శంకరయ్య యేవో జ్ఞాపకం తెచ్చుకుంటూ అన్నాడు.

సెక్రటరీ కనుబొమ్మలు పైకి యెగవేస్తూ అదేపనిగా శంకరయ్యవైపుకు చూస్తున్నాడు.

"సరేలే...నేను చూస్తానులే...ఈ వుత్తరం మేరీకి యిచ్చెయ్యి..." అంటూ ఆ వుత్తరాన్ని శంకరయ్య చేతికి అందించబోతూ మళ్ళీ వెనక్కు తగ్గి ఆ వుత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చించేసి బుట్టలో పడేశాడు యెంతో కోపంగా.

"ఏయ్...నువ్వు మేరీతో యేం చెప్పక...వెళ్లిపో..." అంటూ శంకరయ్యను గద్దించాడు.

శంకరయ్య నోరు మెదపకుండా తల వంచుకుని వెళ్లిపోయాడు.

ఆనాడు సాయంత్రం, మధు మామూలుగానే యింటికి వచ్చేటప్పటికి సుజాత, వసంతలు మాట్లాడుకుంటూ కూర్చున్నారు. మధు వెంటనే వెనక్కు తిరిగి బజారుదాకా వెళదామని బయలుదేరాడు. కొంచెం దూరంగా రవి కనబడ్డాడు. వెంటనే.

"ఎప్పుడొచ్చారు వూరునుంచి..." అప్రయత్నంగా మధు అడిగేశాడు.

"ఇప్పుడే వచ్చానండీ..." నవ్వు మొహంతో సమాధానం చెప్పాడు రవి.

రవి ముందుకు వస్తూవుంటే, రండి మా యింటికి వెళదాం అనే మాట తప్పనిసరిగా మధు అనాలిసి వచ్చింది. రవి, మధులు, యింట్లోకి ప్రవేశించారు. సుజాత, వసంతలు లేచి గదిలోకి గభాలున వెళ్ళిపోయారు.

రవి, మధుతో యేవేవో చెప్పుకుంటూ పోతున్నాడు.

వసంత, మధు యేమి మాట్లాడుతున్నాడో అతి శ్రద్ధగా వింటోంది. సుజాత యేమీ పట్టించుకోనట్లుగానే, ఆ గదిలో అటూ యిటూ తిరుగుతూ యేవో సర్దుతోంది. వసంతకు యేమీ అర్థంకావటంలేదు. వుత్తరం చూసి కూడా మధు యేమీ అనకుండా వుంటాడా అని అనుమానం. ఆవుత్తరం అసలు ఆయన చూడనేలేదేమో అనిఓమూల సందేహం. సుజాతతో మాట్లాడుతున్నప్పుడు కూడా యే విధమైన అనుమానానికి తావులేకపోయింది. అటూ యిటూ ఓ సారి పరికించి, రవి, యిక వెళతాను అంటూ లేచాడు. గుమ్మందాక మధు నడిచాడు, రవిని యింటికి పంపటానికి. రవి, తీవ్రంగా ఆలోచించుకుంటూ నడుస్తూ వెళుతున్నాడు. వసంత గదిలోంచి బైటకువస్తూ, వెళుతున్నాను అంది. వాకిటి తలుపు దగ్గరగా వేసి యింట్లోకి వస్తున్న మధు, చిరునవ్వుతో యెదురయ్యాడు. వసంతకు అంతా అయోమయంగా వుంది. మధువైపుకు చిత్తరచూపులు చూస్తూ వసంత చకచక యింటికి వెళ్ళిపోయింది.

వసంత కోరుకున్నట్లు కాలేదు. పైపెచ్చు, తన తండ్రి పెళ్ళి విషయంలో తొందరచేస్తున్నాడు. ప్రొద్దస్తమానం, రవి యెదురుగానే కనిపిస్తూవుంటాడు. వసంతకు కంపరం పుట్టుకొస్తోంది. తన కూతురు కోర్కె తీర్చటం లేదనే మానసిక దిగులుతో మంచం యెక్కాడు వసంత తండ్రి.

కళ్లు మూసుకుని, కళ్లు తెరిచేటప్పటికి యెంతో కాలం గడిచిపోయినట్లు అనిపిస్తోంది వసంతకు. తనతో చదువుకున్న వాళ్ళందరు పెద్దపెద్ద చదువులు చదువుకుంటున్నారు. కొంతమంది పెళ్ళిళ్లు చేసుకుని సుఖంగా కాపరం చేసుకుంటున్నారు. తాను పడుతున్న వ్యధ తనకు తెలిసినంతలో యెవ్వరూకూడా పడటం లేదేమో అని దిగులుపడుతూ వుంది. తనకు వచ్చిన లోటేమిటి? తనకు యితరులనుగల తేడాయేమిటి? ఏమి టేమిటో వెర్రిగా ఆలోచించటం మొదలు పెటుతుంది. అంతులేని ఆలోచనలు, అగాథ సముద్రంనుంచి కెరటాల్లాగా, పైకి వుబికి, వుద్రేకంగా ముందుకువచ్చేసి, దారి తెన్నూ తెలీక, వికలాలు అయిపోతున్నాయి. వడ్డుకొచ్చి కొట్టుకున్న అలల్లాగా, తన మనస్సు ఏవిధంగా

ఆలోచించలేక పోతోంది. చివరకు వెక్కి వెక్కి ఏడ్చి బాధ తగ్గించుకుంది.

పెద్ద బంగళా. ఆవరణచుట్టూ మామిడిచెట్లు, మధ్య మధ్య సపోటా మొక్కలు గుమ్మటాల్లాగ వూగుసు లాడుతున్నాయి. దక్షిణంవైపు గులాబి అంట్లు. వాటిని ఆనుకుని సంపెంగ గుబురు. వాకిలికి ఎదురుగా ద్వారపాలకుల్లాగ సన్నజాజిమల్లె, తీగలు. కళకళలాడుతూ రకరకాల రంగులపూలు. అసలు ఈ పూలవాసనలకు, ఆ కమ్మటి గాలులకు రోగాలు నయమై పోతాయి అందులో రవిగారి హస్తవాసి మంచిదని ఊళ్లో ఓ ప్రతీతి ప్రబలంగా వ్యాపించి పోయింది. డాక్టరుగా చలామణి అవటంలో ఎంతో ఎక్కువకాలం పట్టలేదు. తోటలో యిల్లు, ఇంటి ప్రక్కనే డిస్పెన్సరీ. తెల్లారిలేస్తే జనం కిటకిటలాడి పోతారు. ఎంతమంది రోగులు! ఎంతమంది రోగులు! రవి ఒక్కడే యిదంతా సంభాళించుకునే అవకాశం దాటిపోయింది. ఇంకా ఇద్దరు ముగ్గురు కంపౌండర్లు, ఒక నర్సు ఇంకా ఎంతో సిబ్బంది. నలుగురుకు కన్నుకుట్టుగావుంది. రవి ప్రాక్టీసు రోజు రోజుకు పెరిగిపోతోంది. డబ్బుతోపాటు, గౌరవ మర్యాదలు కూడా పెరిగి పోతున్నాయి. రవి తనకువచ్చిన కీర్తిని చూసుకుని సంతోషిస్తున్నాడు.

వసంత కళ్లు చెదిరిపోతున్నాయి. హృదయంలోంచి ఆవేదన తీవ్రంగా బయలుదేరుతోంది. పైకి చెప్పలేనిబాధ అనుభవిస్తోంది. తాను చూస్తున్న వస్తువు యేమీ కనిపించటంలేదు. బుర్ర గిర్రున తిరిగిపోతోంది. తాను ఇంత అన్నంవండి, మంచంలో అతుక్కుపోయిన ముసలి తండ్రికి పెట్టి, తాను కాస్త తిని, మిగతా కాలం అంతా తీరిగ్గా ఏడుస్తూ కూర్చుంటోంది. తాను ఇతరుల దగ్గిరకు వెళ్లటానికి మనస్సు వప్పటంలేదు. చాలాసార్లు సుజాత దగ్గరకు వెళ్లి మంచీ చెడు చెప్పుకుని గుండెబరువు తగ్గించుకుందామనుకుంటుంది. కాని మొహం చెల్లటంలేదు సుజాతను చూడటానికి. తనలో తాను కుమిలిపోతోంది.

ఎదురుగా మంచంమీద నిలువునా పడుకున్న తన తండ్రి మొహంలో వయస్సు ముడతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. శరీరం అంతా వేలాడి పోతు

న్నట్లుంది. దగ్గరకు వెళ్లటానికి కూడా భయంగా వుంది. తల్లిలేని లోటులేకుండా పెంచి పెద్దదాన్ని చేసిన తనతండ్రి యివ్వాళ మంచంలో నిస్సహాయస్థితిలో పడుకుని వున్నాడు. రవి యిచ్చిన మందు వేళకు యిస్తూవుంటుంది. "అమ్మాయి నా మాటవినవు" అంటూ హీనస్వరంతో అంటూవుంటాడు. గబగబ గదిలోకి వెళ్లి, తన తండ్రి చూడకండా కడుపార యేడుస్తుంది. తన తండ్రి ఆయాస పడుతున్నాడు. ఏదో మందిచ్చింది. ఆయాసం తగ్గలేదు. వసంత కాళ్లుచేతులు వణికిపోతున్నాయి. ఒక్క పరుగున రవి డిస్పెన్సరీకు పరుగెత్తింది. గుమ్మం దగ్గరగా నిలబడింది. ఆసుపత్రి సద్దు మణిగింది. రవి లోపల గదిలో కుర్చీలో కూర్చుని వున్నాడు. అద్దంలో రవి మొహం స్పష్టంగా కనిపించింది. వసంత గుండెలో దడ ప్రారంభమయింది. రవి మొహంలో తాను ఎన్నడూ చూడని క్రొత్తరకపు ఆకర్షణ చూడకలిగింది. మనస్సంతా యెటో పోతోంది. నిశ్చేష్టురాలై అట్లాగే అద్దంలోచూస్తూ నుంచుంది. యింకో గదిలోంచి నర్సు మెల్లిగావచ్చి, రవి ప్రక్కనే నిలబడింది. రవి యెంతో ఆప్యాయంగా నర్సుతో మాట్లాడుతున్నాడు. నర్సు చిరునవ్వు మొహంతో సమాధానం ఇస్తున్నది. రవికళ్లు, నర్సుకళ్లు కలిసిపోతున్నాయి. రవి చటుక్కున ఏదో అన్నాడు. నర్సు పక్కున నవ్వింది. రవి పకపకానవ్వాడు. వసంత వళ్లు తెలీకండా బావురుమంది. గభాలున రవి లోపల్నుంచివచ్చాడు. వళ్లు తెలిసి, వణుక్కుంటూ వసంత పమిట కొంగుతో కళ్ళు తుడుచుకుంటోంది.

"నాన్న ఆయాసపడుతున్నాడు..." తలవంచుకునే అనేసి గబగబ వెనక్కి చూడకుండానే ఇంటికి పరుగెత్తుకుని పోయింది.

రవి ఆదుర్దాగా ఓ పెట్టె పట్టుకుని నర్సుతో సహా మామయ్యదగ్గరకు వచ్చేశాడు. ముసలాయన ఆయాసపడుతున్నాడు. వసంత అక్కడలేదు. రవి నాలుగుమూలల ఒక్కసారి చూశాడు. వసంత కనిపించలేదు. ఏదో మందిచ్చి మంచినీళ్ళు తాగించాడు. కాని మృత్యుదేవతతో వృద్ధాప్యం తీవ్రంగా ఘర్షణ పడుతోంది. తన శక్తులన్నీ ఉపయోగించుకుని, మృత్యువును దూరంగానే ఉంచుతూవస్తున్నాడు. మనో నిబ్బరంతో, వసంత పెళ్ళి చూపిపోవాలనే

ఆసతో, కొనవూపిరిన ప్రాణం రెపరెప కొట్టుకుంటోంది. రవి నిశ్చలంగా ఆ ముసలాయన వంక చూస్తూ కూర్చున్నాడు.

"వసంతా...వసంతా..." ఎక్కడనుంచో మెల్లిగా శబ్దం పెగిలింది.

"మా ఆసుపత్రి నర్సు...వసంత యిక్కడ లేదు..." ఆయనకు వినపడేటట్లు చెప్పాడు రవి.

ముసలాయన ఇంకా ఆయాస పడుతున్నాడు. ఎక్కడనుంచి వచ్చిందో వచ్చేసింది వసంత, తండ్రి మంచం దగ్గరకు. ఆయాసంతో మాట్లాడలేక కళ్ళు మూసుకుని రొప్పుతున్నాడు. వసంత గుండె తరుక్కుపోతోంది. రవి కన్నెత్తికూడా వసంతవైపుకు చూడనేలేదు. నర్సు, రవి వంక రెండుమూడుసార్లు చూసింది. ఇంతలోనే మధు, సుజాతలు గబగబ వచ్చేశారు లోపలికి.

"సీతయ్యగారు...సీతయ్యగారు" మధు రెండుసార్లు గట్టిగా పిలిచాడు,

"ఇందాకటి నుంచి ఆయాసంతో బాధపడ్డాడు. కాసేపు నిద్రపోనీండి" అని డాక్టరు రవి అన్నాడు.

మధు మెదలకుండా వెనక్కు తగ్గాడు.

వసంత మొహం అంతా పాలిపోయి తెల్లగా అయినట్లు అయిపోయింది. జుట్టు చిందరవందరగా మొహం అంతా కప్పేసుకుని వుంది. చీర మడతపడటంవలన కుడికాలు మోకాలు గజగజ వణకటం కనిపిస్తోంది. చెమటలు పట్టటం వలన, వసంత మొహాన కుంకంబొట్టు, రెండు పాయలుగా చీలి, కళ్యాణం బొట్టు, ఆకారం ఏర్పరుచుకుంది. కను బొమ్మలు మాటి మాటికి తుడుచుకుంటూ మొహం అంతా తుడుచుకోవటం వలన గామాలు ఎడమ బుగ్గన నల్లగా మచ్చగా కనిపిస్తోంది. కనురెప్పలు తడిసివున్నాయి. ఆ కళ్లు ఎంతో దీనంగా దేన్నో వేడుకొంటున్నట్లు కనిపిస్తున్నాయి. ఎడమవైపున నర్సు, డాక్టరు రవి నుంచున్నారు. కుడివైపు మధు, సుజాతలు నుంచున్నారు. తాను మధ్యగా మంచాన్ని వూగిస్తున్న తండ్రివైపుకు చూస్తూ నుంచుంది. తన మనస్సు ఏమీ

పనిచెయ్యటం లేదు. కళ్ళు తీవ్రంగా చూడాలని ప్రయత్నం చేస్తున్నా కను రెప్పల బరువువలన, కళ్ళుబాగా తెరుచుకుని బైట ప్రపంచాన్ని చూడలేక పోతోంది. ఆ పరిస్థితిలో, మధుమీద అనురాగంకాని, రవిమీద ద్వేషం కాని వసంతకు జ్ఞాపకం రావటంలేదు. నర్సుమీద ద్వేషం, సుజాతమీద ప్రేమ అప్పటికప్పుడు తన హృదయంలోంచి ఉబికి పైకివస్తున్నాయి. ఒక ఆవేశం వసంత నరాల్లో ప్రవేశించింది. ఇక వుండబట్టలేక పోతోంది. కాళ్ళు చేతులు తడబడుతున్నాయి. వళ్ళు తెలియటంలేదు. అమాంతంగా సుజాత కాళ్ళమీద పడి నన్ను క్షమించండి అంటూ హెూరుమని ఏడ్చింది వసంత.

మధు తత్తరపడి పోయాడు.

సుజాత నోటమాటలేదు.

వసంత తండ్రి మంచంలోంచి అమ్మాయి...అమ్మాయి...అని రెండు సార్లు గట్టిగా అరిచాడు.

రవి నిశ్చేష్టుడై అట్లాగే నిలబడి పోయాడు. నర్సు భయంగా వసంత వైపుకు చూస్తూ నుంచుంది.

సుజాతకు అంతా అయోమయంగావుంది. ఏమీ అర్థం కావటంలేదు. ఏదోమాటలతో వోదారుస్తోందే కాని, సుజాతకు మాత్రం వసంత తన కాళ్ల మీద యెందుకు పడిందో అర్థం కావటంలేదు.

వసంత కడుపార ఏడ్చి కన్నీళ్లతో సుజాత పాదాల్ని కడిగేసింది. అమాంతం లేచి నిలబడింది. నర్సు కళ్లల్లోకి చూసింది. నర్సు గజగజ వణికి పోయింది. రవికియేమీ అర్థం కావటంలేదు. రవి తీవ్రంగా చూస్తూ నిలబడ్డాడు.

'నాన్నా...నాన్నా...నువ్వు చెప్పినట్లు చేస్తానా నాన్నా' అంటూ వసంత తన తండ్రినిచుట్టేసుకుంది.

వసంత తండ్రి యేమీ మాట్లాడలేదు.

వసంత, తనగొంతుక చించుకుని నాన్నా అని అరించింది.

మధు సుజాతలు దద్దరిల్లి పోయారు.

నర్సు మొహం వివర్ణం అయిపోయింది.

మామయ్యా అంటూ గట్టిగా అరిచాడు రవి.

సుజాత అమాంతం వసంత దగ్గరకు రాబోయింది.

రవి వసంతను కౌగలించుకుని, మామయ్య చచ్చిపోయాడు అని చిన్న పిల్లవాడిలాగ యేడ్చాడు.